



తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం


తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక






హైదరాబాద్ సంపుటి:05 సంచిక :201 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 12, వెల. 6రూ/ సోమవారం- 26 - జనవరి - 2026


## సింగిల్ నోడల్‘ ద్వారా రూ.5,929 కోట్ల నిధులివ్వండి



పోలవరం మూడో విడత అడ్వాన్సుపై కేంద్రానికి లేఖ

స్పర్శ్ తరహాలోకి మార్చి ఇస్తామన్న కేంద్రం

సింగిల్ నోడల్ ఏజెన్సీ ద్వారానే కావాలన్న

రాష్ట్రం తాజాగా లేఖ, త్వరలో నిధుల విడుదల!

అమరావతి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం కేటాయించిన నిధుల్లో మూడో విడత అడ్వాన్సుగా సుమారు రూ.5,929 కోట్లు విడుదల చేయాలని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ అధికారులు కేంద్రాన్ని కోరారు. ఈ అంశం ఆర్థిక శాఖ, కేంద్ర జలశక్తిల పరిశీలనలో ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో కేంద్రం ఇప్పటికే రెండు విడతలుగా దీనికి అడ్వాన్సు నిధులిచ్చింది. మిగతా..2లో

## యువతకు ఉద్యోగాల కల్పనే ప్రధాని ధ్యేయం

రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




చాంద్రాయణగుట్ట సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో యువకుడికి నియామక పత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో డీఐజీపీ ఉదయభాస్కర్ బిల్లా

కేశవగిరి, శామీర్‌పేట–: దేశంలోని యువతకు అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడమే ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ హైదరాబాద్ మెన్స్‌క్లబ్‌లో జరిగిన రోజ్‌గార్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 213 మంది యువతీ, యువకులకు కిషన్‌రెడ్డి, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు నియామక పత్రాలు అందజేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా హకీంపేటలోని జాతీయ పారిశ్రామిక భద్రతా శిక్షణ అకాడమీలో జరిగిన మరో మేళాలో మిగతా..2లో

## సింగరేణిలో రెండు స్కాంలనే బయటపెట్టా..



- సాధారణంగా టెండర్ షరతులు మార్చిస్తే అన్ని కాంట్రాక్టర్లతో సమావేశం పెట్టాలని..
- వారి అభిప్రాయాలు తీసుకోవాలని.. మినిట్స్ నమోదు చేయాలని హరీశ్‌రావు తెలిపారు.
- కానీ ఇక్కడ అది జరగలేదని అన్నారు.. ఈ తతంగం వెనుక ఏం జరిగింది మీటింగ్ మినిట్స్ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్: సింగరేణిలో ఒకటి.. రెండు కాదు.. పదుల సంఖ్యలో స్కాములు జరిగాయని తెలిపారు. మిగతా..2లో

## నాంపల్లి అగ్నిప్రమాదం కేసు..

# ఫర్నిచర్ షాపు యజమాని అరెస్ట్

- బచ్చాస్ ఫర్నిచర్ షాపు కేసుకు సంబంధించి షాపు యజమాని సతీష్ బచాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.
- నిబంధనలకు విరుద్ధంగా సతీష్.. సెల్లార్‌లో ఫర్నిచర్ షాపు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.



హైదరాబాద్, జనవరి 25: నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో నిన్న (శనివారం) అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. నాలుగు అంతస్తుల భవనంలోని సెల్లార్‌లో ఉన్న ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం జరిగింది. దుకాణంలో పని చేస్తున్న సుభాన్‌పుర నివాసి మహ్మద్ ఇంతియాజ్, శాస్త్రిపురం ప్రాంతానికి చెందిన సయ్యద్ హబీబ్‌లతోపాటు సెల్లార్‌లో చిక్కుకున్న ప్రవీణ్, అఖిల్, బీబీలు మృత్యువాతపడ్డారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫర్నిచర్ షాపు యజమాని సతీష్ బచాస్‌ను అరెస్ట్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సతీష్ సెల్లార్‌లో ఫర్నిచర్ షాపు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సతీష్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. నిందితుడిని అబిడ్స్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

నాంపల్లి స్టేషన్ రోడ్డులోని హిందీ ప్రచార్‌సభ భవనం పక్కన సాయి విశ్వాస్ ఛాంబర్స్ అనే ఐదంతస్తుల భవనం ఉంది. భవనం సెల్లార్‌లో బచ్చాస్ ఫర్నిచర్ దుకాణం ఉంది. దుకాణంలో సుమారు 22మంది పని చేస్తున్నారు. యాదయ్య అనే వ్యక్తి వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ప్రణీత్(11), అఖిల్(7)తో కలిసి సెల్లార్‌లోనే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి కంటైనర్‌లో చైనా నుంచి భారీగా ఫర్నిచర్ వచ్చింది. ఫర్నిచర్‌ను రెండు సెల్లార్లలో భద్రపరిచారు. శనివారం ప్రణీత్, అఖిల్‌లు స్కూలుకు వెళ్లకుండా ఇంటిలోనే ఉండిపోయారు. తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళుతూ.. మిగతా..2లో

## టెండర్లపై విచారణకు సిద్ధం




హరీశ్‌రావు లేఖ రాస్తే 2014 నుంచి ఇప్పటిదాకా

సింగరేణి కాంట్రాక్టులపై సిట్ దర్యాప్తు చేయిస్తా

సైట్ విజిట్ నిబంధన భారాస ప్రభుత్వ హయాంలోనే వచ్చింది

సృజన్‌రెడ్డి భారాస మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డికి అల్లుడు

ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డితో ఏం సంబంధం

సైట్ విజిట్ నిబంధన పెట్టాలని సెంట్రల్ మైన్స్ ప్లానింగ్ సంస్థ ఇచ్చిన మార్గదర్శకాలను మీడియాకు చూపుతున్న భట్టి

హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సింగరేణి సంస్థలో టెండర్ల కేటాయింపులన్నింటిపై విచారణ చేయించడానికి సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హరీశ్‌రావు తనకు లేఖ రాస్తే అవసరమైతే సిట్ వేసి విచారణ చేయిస్తానని స్పష్టం చేశారు. ‘సింగరేణి టెండర్ల కేటాయింపుల్లో సైట్ విజిట్ సర్టిఫికెట్ దాఖలు చేయాలనే నిబంధన పెట్టి

## 2026 పోల్స్ కేవలం ఎన్నికలు కాదు- ప్రజాస్వామ్య యుద్ధం




- మహాబలిపురంలో టీవీకే విజయ్ పార్టీ మీటింగ్
- అధికార పార్టీపై కీలక వ్యాఖ్యలు చేసిన విజయ్

తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కేవలం పోటీగా కాకుండా అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య యుద్ధంగా అభివర్ణించారు టీవీకే విజయ్. ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని, దేనికీ రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే ప్రత్యక్షంగా, డీఎంకే పరోక్షంగా బీజేపీకి సరెండర్ అయ్యాయని విమర్శించారు. తమిళనాడులో అవినీతి అంతానికి సమయం ఆసన్నమైందని చెప్పారు. డీఎంకే ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఆదివారం మహాబలిపురంలో నిర్వహించిన సభలో విజయ్ మాట్లాడుతూ

## మోదీని ఆకట్టుకున్న యూఏఈ

# ‘ఇయర్ ఆఫ్ ద ఫ్యామిలీ‘ కాన్సెప్ట్

- యూఏఈ ‘ఫ్యామిలీ ఇయర్‘ కార్యక్రమాన్ని ప్రశంసించిన ప్రధాని మోదీ
- ఇది భారత కుటుంబ వ్యవస్థతో సమానమని వ్యాఖ్య
- మన్ కీ బాత్‌లో గుజరాత్‌లోని చందంకి గ్రామ ప్రస్తావన
- గ్రామంలోని సామూహిక వంటగది వల్లే ఇళ్లలో వంట చేయరని వెల్లడి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) చేపట్టిన ‘ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ‘ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఇది భారతీయ కుటుంబ విలువలకు అద్దం పడుతోందని, కుటుంబ బంధాలను బలోపేతం చేసే గొప్ప చొరవ అని కొనియాడారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం ‘మన్ కీ బాత్‘లో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కుటుంబ వ్యవస్థలకు లభిస్తున్న గౌరవాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని గుజరాత్‌లోని చందంకి గ్రామంలో ఉన్న ఓ ప్రత్యేక సంప్రదాయాన్ని ఉదహరించారు. ఆ గ్రామంలోని ప్రజలు, ముఖ్యంగా పెద్దవారు తమ ఇళ్లలో వంట చేయరని, గ్రామంలోని సామూహిక వంటశాల (కమ్యూనిటీ కిచెన్) ద్వారా అందరూ కలిసి భోజనం చేస్తారని వివరించారు. మిగతా..2లో

## ఓటర్ల దినోత్సవమే నాటకం

# ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న

- జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల కమిషన్‌పై మమతా ఫైర్
- బీజేపీ తరఫున పనిచేస్తున్న ఈసీ అంటూ ఘాటు ఆరోపణలు
- ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తూ ప్రజాస్వామ్య పునాదులు ధ్వంసం చేస్తున్నారన్న వ్యాఖ్యలు




జాతీయ ఓటర్ల దినోత్సవం వేళ ఎన్నికల కమిషన్ తీరుపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తూ, భారత ప్రజాస్వామ్యానికి పునాదులే ధ్వంసం చేస్తున్న సంస్థగా ఎన్నికల కమిషన్ మారిందని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారమంతా బీజేపీ ప్రయోజనాల కోసమే జరుగుతోందని మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### ధైర్యం చేస్తోందా: మమత

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ‘దారుణమైన నాటకంగా అభివర్ణించిన ఆమె, ఈ సందర్భంలోనే ఎక్స్ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. “బీజేపీ అనే తమ మాస్టర్ తరఫున ప్రతిపక్షాలను నలిపేస్తూ, భారత ప్రజాస్వామ్యానికి పునాదులే కూల్చేస్తున్న ఎన్నికల కమిషన్, ఇంకా ఓటర్ల దినోత్సవం జరుపుకోవడానికి ధైర్యం చేస్తోందా?“ అంటూ ప్రశ్నించారు.

## ప్రభుత్వ ధనం ప్రజలదని, స్వీకరించనని స్పష్టీకరణ




- ప్రభుత్వ జీతం నాకు వద్దు.. ఒక్క రూపాయి కూడా తీసుకోను
- ఏపీ ప్రభుత్వ యోగా, నేచురోపతి సలహాదారుగా నియమితులైన మంతెన
- క్యాబినెట్ హోదా ఉన్నా జీతం, సౌకర్యాలు తీసుకోబోనని ప్రకటన
- సీఎం చంద్రబాబు ముందు కఠిన నిబంధనలు పెట్టిన మంతెన సత్యనారాయణ రాజు
- నిస్వార్థ సేవ చేయాలన్న మంతెన నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు

## ఈ పురస్కారాలు రాబోయే తరాలకు

# గొప్ప స్ఫూర్తినిస్తాయి

- తెలంగాణకు చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ పురస్కారాలు
- విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విభిన్న రంగాల్లోని ప్రతిభకు గుర్తింపు రావడం గర్వకారణమన్న కేటీఆర్
- క్షేత్రస్థాయిలో పనిచేసే వారిని గుర్తించడం అభినందనీయం అని ప్రశంస
- మామిడి రామారెడ్డికి మరణానంతరం పద్మశ్రీ రావడంపై హర్షం



ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గానూ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాల్లో తెలంగాణకు చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు లభించడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హర్షం వ్యక్తం చేశారు.

## ఏపీకి అత్యధిక నిధులు రాబట్టాలని ఎంపీలకు స్పష్టమైన ఆదేశం




- పార్లమెంటు బడ్జెట్ సమావేశాలపై టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు భేటీ
- అమరావతికి రెండో విడత నిధులు, పోలవరం పూర్తికి సహకారం కోరాలని సూచన
- కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ వ్యూహం.. ఏపీకి నిధులు రాబట్టాలని ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం
- విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పిలుపు

మొదటి పేజి తరువాయి

## సింగిల్ నోడల్' ద్వారా రూ.5,929 కోట్ల నిధులివ్వండి
## పోలవరం మూడో విడత అడ్వాన్సుపై కేంద్రానికి లేఖ

వీటిలో రాష్ట్రం 80 శాతానికి పైగా ఖర్చు చేసింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు మూడో విడత ఇవ్వాలంటు కూడా లేఖ రాసింది. ఈ నిధులిచ్చే విధానాన్ని మార్చాలని కేంద్ర అధికారులు మొదట భావించారు. ప్రస్తుతం ఆ విధానం మారిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని, ఇప్పటి వరకు ఇస్తున్న సింగిల్ నోడల్ ఖాతా విధానాన్నే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ అధికారులు దీనిపై తాజాగా లేఖ రాశారు. దీంతో మూడో విడత అడ్వాన్సు నిధులు కూడా కేంద్రం నుంచి రానున్నాయి. 'సింగిల్ నోడల్' కాకుంటే ఇబ్బంది : రెండు విధానాల్లో (స్పర్శ్ విధానం, సింగిల్ నోడల్ ఏజెన్సీ) కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఆర్థికశాఖ, నిధులు విడుదల చేస్తోంది. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టుకు సింగిల్ నోడల్ ఖాతా విధానంలోనే నిధులిచ్చింది. ఇప్పుడు మాత్రం దీన్ని మార్చి స్పర్శ్ నమూనాలో విడుదల చేస్తామని పేర్కొంది. ఇందుకు పోలవరం, రాష్ట్ర ఆర్థిక శాఖకు సంబంధించిన అధికారులు సమ్మతించలేదు. ఈ సంవత్సరం జూన్ వరకు పోలవరంలో పనులు ముమ్మరంగా సాగనున్నాయని, నిధులు అత్యవసరమని కేంద్రానికి జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ శనివారం(24-01-26)వ తేదీన లేఖ రాశారు. ఇప్పుడు స్పర్శ్ విధానానికి మారిస్తే ఆ విధివిధానాలన్నీ పూర్తి చేసేందుకు మరింత సమయం పడుతుందని, అవసరమైనప్పుడు నిధుల లభ్యత లేకుండా పోతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఏమిటీ సింగిల్ నోడల్ ఏజెన్సీ విధానం : ఈ విధానంలో కేంద్రం మొదట అవసరమైన నిధులు కేటాయించి, ఆ తర్వాత వాటిని రాష్ట్రానికి విడుదల చేస్తుంది. ఈ పథకం అమలు చేసే ఏజెన్సీ సింగిల్ నోడల్ ఖాతాను, జీరో బ్యాలెన్సు నిధులతో నిర్వహిస్తుంది. ఎప్పుడు బిల్లు చెల్లించాల్సి వస్తే అప్పుడు ఆ ఖాతాకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులను విడుదల చేస్తుంది. బడ్జెట్ విడుదల ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత చేసిన పనికి బిల్లులను సమర్పిస్తారు. ఆ ప్రక్రియ అనంతరం అప్పుడు ఆ పథకం నిర్వహించే మేనేజర్ సంబంధిత డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారులకు నిధులు విడుదల చేస్తారు. స్పర్శ్ విధానంలో ఇలా : తాజాగా స్పర్శ్ విధానంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు నిధులిస్తోంది. ఇందులో ఒకేసారి సంబంధిత పథకం అమలు చేసే ప్రభుత్వ శాఖకు కేంద్ర, రాష్ట్ర వాటా నిధులు కూడా చేరతాయి. ఆ ప్రభుత్వ శాఖే సంబంధిత డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారులకు సంబంధిత నిధులు పంపిణీ చేస్తుంది.

## మోదీని ఆకట్టుకున్న యూఏఈ 'ఇయర్ ఆఫ్ ద ఫ్యామిలీ' కాన్సెప్ట్

ఈ విధానం ప్రజల మధ్య ఐక్యతను, కుటుంబ భావనను పెంపొందిస్తోందని మోదీ అన్నారు. ఇటీవల భారత పర్యటనకు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నహ్యాన్‌తో జరిగిన సంభాషణను ప్రధాని గుర్తు చేసుకున్నారు. 2026వ సంవత్సరాన్ని యూఏఈ 'ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ'గా ప్రకటించిందని ఆయన తనతో చెప్పినట్లు మోదీ తెలిపారు. ప్రజల మధ్య సామరస్యం, సామాజిక ఐక్యతను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని యూఏఈ అధ్యక్షుడు వివరించినట్లు పేర్కొన్నారు. యూఏఈ చేపట్టిన ఈ కార్యక్రమం నిజంగా ప్రశంసనీయమని మోదీ పేర్కొన్నారు. ఇటువంటి సామాజిక, సాంస్కృతిక విలువలపై ఇరు దేశాల మధ్య చర్చలు జరగడం భారత్-యూఏఈ బలమైన సంబంధాలకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

### 2026ను 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన యూఏఈ.. కుటుంబ బంధాలే దేశానికి పునాది

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 సంవత్సరాన్ని 'కుటుంబ సంవత్సరం' (ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ)గా పాటిస్తున్నట్లు యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నహ్యాన్ ప్రకటించారు. అబుదాబిలో జరిగిన 2025 వార్షిక ప్రభుత్వ సమావేశాల సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. దేశ భవిష్యత్తు, సుస్థిరతకు కుటుంబ వ్యవస్థే పునాది అని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోందని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది. ఎమిరేటీ కుటుంబాల శ్రేయస్సు, స్థిరత్వం, బలోపేతమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధ్యక్షుడు స్పష్టం చేశారు. బలమైన, సుస్థిరమైన కుటుంబాలే దేశ దీర్ఘకాలిక ప్రగతికి ఆధారం అని, కుటుంబ వృద్ధి జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశమని ఆయన పేర్కొన్నారు. దేశ జాతీయ గుర్తింపు, భద్రత, సమృద్ధిలో కుటుంబ శ్రేయస్సు అంతర్భాగమని నొక్కిచెప్పారు. ఐక్యత, సహకారం, సానుభూతి వంటి విలువలను ప్రోత్సహించి, వాటిని భవిష్యత్ తరాలకు అందించడం కూడా ఈ కార్యక్రమ లక్ష్యాల్లో ఒకటి.

## ఏపీకి అత్యధిక నిధులు రాబట్టాలని ఎంపీలకు స్పష్టమైన ఆదేశం

అమరావతి : త్వరలో జరగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ ఎంపీలకు కీలక దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రానికి అత్యధికంగా కేంద్ర నిధులు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీలకు ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించాలని చంద్రబాబు సూచించారు. ముఖ్యంగా అమరావతి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రెండో విడత నిధులు, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసేందుకు కేంద్ర సహకారం, విశాఖ రైల్వే జోన్‌కు నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, జాతీయ రహదారుల వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇప్పటికే అమరావతికి రూ.15 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో కూడా ఇదే తరహా సాయం కోరుతున్నాం" అని పేర్కొన్నారు. అలాగే, "పోలవరం ప్రాజెక్టును 2027 కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాము. ఆ దిశగా కేంద్రం కూడా సహకరించాలి" అని వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, అధిక నిధులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎంపీలందరూ చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం ఆదేశాలతో, బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ వాణిని బలంగా వినిపించేందుకు టీడీపీ ఎంపీలు సిద్ధమవుతున్నారు.

## సింగరేణిలో రెండు స్కాంలనే బయటపెట్టా..

నేను ఇప్పటికి ఓబీ స్కాం, సోలార్ స్కాం మాత్రమే చెప్పాను. సింగరేణిలో ఇంకా అనేక స్కాములు ఉన్నాయని అన్నారు. ఈ కుంభకోణంలో కింగ్ పిన్ ఏ హోటల్లో మీటింగ్ పెట్టాడు? ముఖ్యమంత్రి బంధువు కూడా ఆ హోటల్లో కూర్చున్న ఫోటోలు మా దగ్గర ఉన్నాయని.. వాటిని టైం వచ్చినప్పుడు బయట పెడతామని తెలిపారు. డీజిల్‌ను కాంట్రాక్టర్ల పరిధిలోకి తెచ్చిన తర్వాత టర్నోవర్ అర్హత పెంచి 20 ఏళ్ల అనుభవం ఉన్న స్థానిక కాంట్రాక్టర్లను పక్కన పెట్టారని హరీశ్‌రావు తెలిపారు. ఇక నుంచి డీజిల్ కాంట్రాక్టర్ల పరిధిలోనే ఉంటే, ఉన్న కాంట్రాక్టర్లు స్వయంగా డీజిల్ కొనుగోలు చేసుకునే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మీ స్వార్థం కోసం మైనింగ్ అనుభవం లేని కొత్త కాంట్రాక్టర్లకు దారులు తెరిచారని అన్నారు. మేము బొగ్గు స్కాం అని భయపెట్టగానే నాలుగు పేపర్లు పట్టుకొని వచ్చి, మీడియాని సైతం తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసిన భట్టి గారు.. నేను బయటపెట్టిన సోలార్ స్కామ్, పేలుడు పదార్థాల స్కామ్, ఉద్యోగుల డీప్రొమోషన్ వంటి కీలక అంశాలపై ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు. సింగరేణిలో ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో స్కాములు జరిగిందన్నది వాస్తవం కాబట్టి ఆయన సైలెంట్‌గా ఉన్నారని అన్నారు. అడ్డగోలుగా నిబంధనలు మార్చి, రేవంత్ రెడ్డి బావమరిదికి, ఇతర అనుయాయులకు టెండర్లు కట్టబెట్టింది నిజమని అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో స్కీములు రాలేదు గానీ పదుల సంఖ్యలో స్కాంలు మాత్రం వచ్చాయని ఎద్దేవా చేశారు.

## నాంపల్లి అగ్నిప్రమాదం కేసు..
## ఫర్నిచర్ షాపు యజమాని అరెస్ట్

సెల్లార్‌లోనే ఆడుకోమని వారికి చెప్పారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో రెండు సెల్లార్లలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పొగలు రావటం గమనించిన కొంతమంది ఫర్నిచర్ షాపు సిబ్బంది బయటకు పరుగులు తీశారు. మహ్మద్ ఇంతియాజ్, సయ్యద్ హబీబ్, బీబీ అనే వృద్ధురాలు లోపల చిక్కుకుపోయారు. బీబీని కాపాడ్డానికి ప్రణీత్, అఖిల్ లోపలికి వెళ్లారు. మళ్లీ తిరిగిరాలేదు. మంటల్లో కాలి ఐదుగురు చనిపోయారు.

## యువతకు ఉద్యోగాల కల్పనే ప్రధాని ధ్యేయం

238 మందికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నియామక పత్రాలు అందించారు. చాంద్రాయణగుట్టలో జరిగిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ.. ఈరోజు దేశవ్యాప్తంగా 45 కేంద్రాల్లో రోజ్‌గార్ మేళాలను నిర్వహించి 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం విశేషమన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా 1.50 లక్షల స్టార్టప్ కంపెనీలతో కేంద్రం ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. 2030 నాటికి రక్షణ పరికరాల దిగుమతులు తగ్గించి దేశంలోనే తయారుచేసేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని భారీ తెరపై వీక్షించారు. సీఆర్‌పీఎఫ్ హైదరాబాద్ ఐజీ(మెడికల్) డాక్టర్ గణేశ్ చంద్ర పధీ, సీఆర్‌పీఎఫ్ హైదరాబాద్ డీఐజీపీ ఉదయభాస్కర్ బిల్లా తదితరులు పాల్గొన్నారు. హకీంపేట నీసాలో యువతికి నియామకపత్రం ఇస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, చిత్రంలో నీసా డైరెక్టర్ డీపీ పరిహార్, డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌దాము

### ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులేవీ: సంజయ్

'ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అందరికీ తెలుసు. సిట్ విచారణకు నన్ను పిలిచి నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అధికారులు చెప్పారు.. ఇందుకు బాధ్యులెవరో తెలుసు.. ఒక్క రాజకీయ నాయకుడినైనా అరెస్టు చేయలేదు.. ఎందుకంటే ఏఐసీసీకి ఫామ్‌హౌస్‌కు డీల్ కుదరలేదు' అని కేంద్ర సహాయ మంత్రి సంజయ్ ఆరోపించారు. హకీంపేటలో జరిగిన మేళాలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగాలు పొందినవారు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా చేయాలని పిలుపునిచ్చారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. 2 లక్షల ఉద్యోగాలిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇచ్చిందో తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను దోషిలా పిలిచారా? లేక వాంగ్మూలం సేకరించారా అని ప్రశ్నించారు. సమావేశంలో నీసా డైరెక్టర్ డీపీ పరిహార్, డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌దాము, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు.

## నా 48 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి వ్యక్తిని ఎక్కడా చూడలేదు' - జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

అని వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.చిత్తూరు జిల్లా నగరిలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో శనివారం(24 -01-26)వ తేదీన 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఘనవ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆయన ఇక్కడి నుంచి శంకుస్థాపన చేశారు. హరిత రాయబారులు రాజేంద్రన్, నారాయణమ్మ, మురుగమ్మ, పార్వతి, నాగరాజులను ఆయన సన్మానించారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఆయన షెడ్యూల్‌లో ఉన్న నగరి ప్రాంతీయాసుపత్రి పర్యటనను సీఎం రద్దు చేసుకున్నారు.ఎక్కువ సంతానముంటేనే ఎన్నికల్లో పోటీ : దేశవ్యాప్తంగా భూగర్భజలాల నాణ్యత గురించి తాజాగా ఓ నివేదిక వచ్చింది. రాష్ట్రంలో ఉన్న భూముల్లో 9.8 శాతం లవణీయత, 8.99 శాతం ఫ్లోరైడ్, 24 శాతం నైట్రోజన్ ఉన్నాయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. యూరియా, రసాయన ఎరువులతోనే దేశానికి ఈ పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారు. దీన్ని అరికట్టేందుకు ఓ పాలసీ తెస్తానని తెలిపారు. జనాభా పెరుగుదలకు మరో పాలసీ అమలుచేస్తానని ఆయన తెలిపారు. గతంలో ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయలేరనే నిబంధన తెచ్చానని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఒకరి కంటే ఎక్కువమంది పిల్లలుంటేనే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి ఉంటుందని అని సీఎం చంద్రబాబు తెలిపారు.ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాజధాని ఆగదు : 'జగన్ అమరావతిపై మూడు ముక్కలాట ఆడారు. ఇప్పుడు కూడా అడ్డుకుంటామని అంటున్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాజధాని మాత్రం ఆగదు. గతంలో దాదాపు రూ.32వేల కోట్ల మేర విద్యుత్తు భారాన్ని మోపారు. సుమారు రూ.1.20 లక్షల కోట్ల వరకు అప్పుచేశారు. గతంలో విధించిన దాదాపు రూ.4,600 కోట్ల ట్రూఅప్ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తోంది. ఇప్పటికే యూనిట్‌కు 39 పైసలు వరకు తగ్గించాం. కూటమి ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యుత్తు ఛార్జీలను పెంచదు. ఇప్పుడు రాష్ట్రంలో గంజాయి సాగు కూడా లేదు. ఈగల్‌తో దాని మీద ఉక్కుపాదం మోపుతున్నాం. ప్రభుత్వోద్యోగులకు పెట్టిన సుమారు రూ.25వేల కోట్ల బకాయిలను విడతలవారీగా చెల్లిస్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.స్వచ్ఛాంధ్ర జీవనవిధానంలో భాగం కావాలి : స్వచ్ఛాంధ్ర మన అందరి జీవనవిధానం కావాలి. ప్రతి మూడో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని చంద్రబాబు తెలిపారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు అన్నీ వస్తే ప్రజలకు ఇంక డంపింగ్ యార్డుల సమస్య ఉండదని అన్నారు. 2026 మార్చి నెల నాటికి దాదాపు 10 లక్షల కుటుంబాలు సేంద్రియ వ్యర్థాల నిర్వహణను పాటించేలా ప్రోత్సహిస్తానని ఆయన పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖమంత్రిగా పవన్‌కల్యాణ్ ఉన్నారని వెల్లడించారు. నాలుగేళ్లలో దాదాపు 26వేల కిలోమీటర్ల డ్రెయిన్లను నిర్మిస్తామని చంద్రబాబు తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రోడ్లు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను అభివృద్ధి చేస్తాం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.బంగారు కుటుంబాలైన ధనలక్ష్మి, గణేష్‌లను దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చిన ధనంజయరాజు, సాయికుమార్‌లను ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు. డిగ్రీ చదివి ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉన్న గణేష్‌కు ఐటీ ఉద్యోగి సాయికుమార్ తన సంస్థలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం ఇవ్వడంతోపాటు కంపెనీలో భాగస్వామ్యం ఇస్తానని చెప్పడం ఎంతో అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ, కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాశ్, మురళీ మోహన్, థామస్, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.ఎక్కువగా ఎందుకు ఖర్చు చేయడం లేదు : సేంద్రియ వ్యవసాయం గురించి వ్యవసాయశాఖ అధికారులు సీఎంకు వివరిస్తుండగా ఆయన కొన్ని ప్రశ్నలు అడగ్గా వారు దానికి సరైన సమాధానం ఇవ్వలేదు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కేంద్రం ఇచ్చిన నిధులు ఎక్కువగా ఎందుకు ఖర్చు చేయడంలేదని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. ఈ సందర్భంగా పట్టాభిని ఉద్దేశించి మాటలకు పరిమితం కాకుండా అమలుపై దృష్టిసారించాలన్నారు. అప్పుడే సరైన నాయకులు అవుతారని చంద్రబాబు సూచించారు. నేను చేసిందే నాకు ఉపన్యసిస్తున్నారంటూ ఆయన చురకలు అంటించారు.

రెండేళ్లలో నా రాజకీయ ప్రస్థానానికి 50 ఏళ్లు :

"2028వ సంవత్సరం నాటికి నా రాజకీయ ప్రస్థానానికి 50 ఏళు .. నేను తరచూ దావోస్ వెళ్లి రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తీసుకొస్తున్నా. సుమారు 18 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25% మన రాష్ట్రానికే వచ్చాయి. త్వరలో ఏఐ డాక్టర్ కూడా వస్తాడు. సంజీవని ప్రాజెక్టుతో మీ అందరి ఆరోగ్యాన్ని కాపాడతా. దాదాపు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతిసేద్యం చేస్తున్న రాష్ట్రం మనది ఒక్కటే"

## ఓటర్ల దినోత్సవమే నాటకం- ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న ఈసీ'

మొదటి పేజి తరువాయి

ఎన్నికల కమిషన్ ప్రస్తుతం హిస్ మాస్టర్స్ వాయిస్ లా వ్యవహరిస్తోందని, ప్రజల ఓటు హక్కులను లాక్కునే పనిలో బిజీగా ఉందని మమతా ఆరోపించారు. "ప్రజల ఓటు హక్కులను హరిస్తూనే, ఓటర్ల దినోత్సవం అంటూ వేడుకలు జరపడం నిజంగా బాధాకరం. ఈ సంస్థ ప్రవర్తన నాకు తీవ్రంగా కలిచివేస్తోంది" అని ఆమె పేర్కొన్నారు.

### ప్రజలను వేధిస్తున్నారు!

ప్రత్యేకంగా బంగాల్ లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితాల సవరణను అత్యంత తొందరపాటు చర్యగా చేపడుతున్నారని, దీని వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని మమతా ఆరోపించారు. ప్రజల పేర్లు తొలగించడం, అనవసరమైన సాంకేతిక కారణాలు చూపిస్తూ ఓటు హక్కును నిరాకరించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. "లోపాల పేరుతో కొత్త కొత్త కారణాలు వెతుక్కుంటూ ప్రజలను వేధిస్తున్నారు. వారి ఎన్నికల హక్కులను హరించడమే లక్ష్యంగా ఈ చర్యలు సాగుతున్నాయి" అని ఆమె ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైన ఓటు హక్కును కాపాడాల్సిన సంస్థే, అదే హక్కును కాలరాస్తోందని ఆమె విమర్శించారు. ఇటీవల కాలంలో ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా బెంగాల్‌లో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై అధికార పార్టీతో పాటు ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మమతా చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సిన అవసరం ఉందని, కానీ ప్రస్తుతం అది కేంద్రంలోని అధికార పార్టీ ప్రభావానికి లోనైందన్న ఆరోపణలను మమతా మరింత బలంగా వినిపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా కమిషన్ వ్యవహరిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

### ఓటు హక్కులను కాలరాస్తున్న సంస్థగా ఎన్నికల కమిషన్!

జాతీయ ఓటర్ల దినోత్సవం అనేది ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచేందుకు, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడానికి నిర్వహించే కార్యక్రమమని గుర్తు చేశారు. అలాంటి రోజునే ఓటు హక్కులను కాలరాస్తున్న సంస్థగా ఎన్నికల కమిషన్ మారిందని ఆమె వ్యాఖ్యానించారు. మమతా వ్యాఖ్యలపై ఎన్నికల



కమిషన్ నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన రాలేదు. అయితే ఈ వ్యవహారం రాజకీయంగా మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్, అలాగే ప్రతిపక్షాల మధ్య ఈ అంశంపై వాదనలు కొనసాగనున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఒకవైపు దేశవ్యాప్తంగా ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి పెట్టాల్సిన సమయంలో, ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మమతా చేసిన ఆరోపణలు రాబోయే ఎన్నికల ముందు రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తం చేసే అవకాశం ఉందని అంటున్నారు.

## 2026 పోల్స్ కేవలం ఎన్నికలు కాదు- ప్రజాస్వామ్య యుద్ధం

మొదటి పేజి తరువాయి



ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పుడు జరగబోయయేది కేవలం ఎన్నిక కాదు. ఒక ప్రజాస్వామ్య యుద్ధం. దీనికి నాయకత్వం వహించబోయే సేనాపతులు మీరే. ప్రస్తుతం అధికారంలో ఉన్న దుష్టశక్తిని, గతంలో రాష్ట్రాన్ని పాలించిన అవినీతి శక్తిని ఎదుర్కొనే ధైర్యం, దృఢ సంకల్పం కేవలం టీవీకేకు మాత్రమే ఉంది. ఏ దుష్ట లేదా అవినీతి శక్తి రెండు తమిళనాడును పాలించకూడదు. అలాంటి పార్టీలను నిజంగా ధైర్యంగా వ్యతిరేకించే ధైర్యం, ధృడ సంకల్పం కేవలం మాకు మాత్రమే ఉంది. ప్రజలను రక్షించడానికి, హాని తలపెట్టే వారి నుంచి ఈ నేలను కాపాడానికి మేం ఇక్కడ ఉన్నాం. అంతేకాకుండా రాజకీయ నిజాయితీకి కట్టుబడి ఉంటాం. మేం ఎవరి కోసమో లేదా దేనికోసమో ఎప్పటికీ రాజీ పడం' అని విజయ్ అన్నారు. ఎన్నికలు, పొత్తుల గురించి చాలా అంచనాలు వేస్తున్నారని, తనని కూడా తక్కువ చేసి మాట్లాడతున్నారని విజయ్ తెలిపారు. 'మా కోసం ఎవరూ నిలబడరని చెబుతున్నారు. ఇది మాకు కొత్త కాదు. గత 30 సంవత్సరాలుగా ఈ పార్టీలు మమ్మల్ని తక్కువ చేసి మాట్లాడుతున్నారు. కానీ ప్రజలు మమ్మల్ని స్పష్టంగా, నిర్ణయాత్మకంగా అంచనా వేశారు. దేశం దీనిని గమనిస్తోంది. ప్రజలు నాపైనే కాకుండా, నా చుట్టూ ఉన్నవారిపై కూడా నమ్మకం ఉంచాలి. ఈ నమ్మకం లేదని నేను చెప్పడం లేదు, కానీ మనం ఆ దిశగా ప్రవర్తించాలి, పని చేయాలి. ఎవరి కోసమో రాజీ పడకూడదు. మనం ఐక్యంగా ఉండాలి. మీలో ప్రతి ఒక్కరూ నాకు ముఖ్యమైనవారే. మీరే ముందుండి పోరాడే యోధులు' అని విజయ్ పేర్కొన్నారు.

అధికార, ప్రతిపక్షంపై విజయ్ విమర్శలు

అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేలను విజయ్ తీవ్రంగా విమర్శించారు. ఈ రెండు పార్టీ తమ వైఖరితో రాజీపడ్డాయని ఆరోపించారు. తమిళనాడులో గతంలో, ఇప్పుడు పాలిస్తున్న వారు బీజేపీకి బానిసలని విజయ్ విమర్శించారు. వారు తమ వేషధారణ కోల్పోకుండా ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. అన్నాండీఎంకే ప్రత్యక్షంగా, డీఎంకే పరోక్షంగా పొత్తు పెట్టుకుందని అన్నారు. ఇదే ప్రజల్లో నిరాశను సృష్టించిందని అన్నారు. కానీ ప్రజలు టీవీకే విశ్వాసం చూపించారని, పార్టీకి హృదయపూర్వకంగా స్పందించారని తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో టీవీకే స్థానాన్ని ప్రజలు సరిగ్గా అర్థం చేసుకున్నారని అన్నారు.

ప్రభుత్వ ధనం ప్రజలదని, దాన్ని స్వీకరించనని స్పష్టీకరణ

అమరావతి : ప్రముఖ యోగా, ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు తన ప్రభుత్వ పదవికి సంబంధించి ఒక ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యోగా, నేచురోపతి విభాగం సలహాదారుగా నియమితులైన ఆయన, క్యాబినెట్ హోదా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి జీతభత్యాలు గానీ, ఇతర సౌకర్యాలు గానీ స్వీకరించబోనని స్పష్టం చేశారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో సీఎం చంద్రబాబు.. మంతెన సత్యనారాయణ రాజును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రభుత్వం చేపడుతున్న 'సంజీవని' వంటి ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేందుకు ఆయన సలహాలు తీసుకోవాలని సీఎం భావించారు. ఈ నేపథ్యంలో మంతెనతో సీఎం చంద్రబాబు దాదాపు 20 నిమిషాల పాటు చర్చించి, పదవిని చేపట్టాలని కోరారు. అయితే, ఈ పదవిని స్వీకరించడానికి తాను మొదట విముఖత చూపినట్లు మంతెన తెలిపారు. కేవలం తెరవెనుక ఉండి సలహాలు ఇస్తానని చెప్పగా, అధికారిక హోదా ఉంటేనే సూచనలకు విలువ ఉంటుందని, పనులు వేగంగా జరుగుతాయని సీఎం చంద్రబాబు నచ్చజెప్పినట్లు వివరించారు. ముఖ్యమంత్రి కోరికను కాదనలేక పదవిని స్వీకరించడానికి అంగీకరించినప్పటికీ, తాను కొన్ని కఠినమైన షరతులు విధించినట్లు మంతెన పేర్కొన్నారు. "నేను ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా జీతంగా తీసుకోను. ప్రభుత్వ వాహనం సహా ఎలాంటి సౌకర్యాలు వినియోగించుకోను. ఈ నిబంధనలకు అంగీకరిస్తేనే బాధ్యతలు చేపడతాను" అని సీఎంకు తేల్చిచెప్పగా, ఆయన అందుకు సమ్మతించారని మంతెన వెల్లడించారు. గత 35 ఏళ్లుగా తన పుస్తకాలపై వచ్చే ఆదాయంతోనే జీవిస్తున్నానని, తాను నిర్వహిస్తున్న ఆశ్రమం నుంచి కూడా జీతం తీసుకోలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ ధనం ప్రజలదేనని, దానిని స్వీకరించకూడదనేది తన జీవిత నియమమని ఆయన అన్నారు.

## టెండర్లపై విచారణకు సిద్ధం

మొదటి పేజి తరువాయి


కాంగ్రెస్ వాళ్లు దోచుకుతిన్నారని హరీశ్‌రావు అంటున్నారు. ఈ నిబంధన 2018 నుంచి ఉంది. భారాస ప్రభుత్వ హయాంలోనే వచ్చింది' అని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో 5 టెండర్లు కేటాయించగా వాటిలో 4 భారాస నాయకుల కంపెనీలకే వచ్చినట్లు ప్రకటించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలసి శనివారం ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "సింగరేణి టెండర్లపై విచారణ చేయాలని హరీశ్‌రావు కేంద్రానికి లేఖ రాయడం ఎందుకు? 2014 నుంచి నేటి వరకు అన్నింటిపై విచారణ చేయాలని నాకు లేఖ రాస్తే సరిపోతుంది. అలా రాస్తే సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన నుంచి రాగానే నేను వెళ్లి చెప్పి విచారణ చేయించేందుకు ఒప్పిస్తా. తెలంగాణ వచ్చాక గనులలో మట్టి(ఓవర్ బర్డెన్- ఓబీ) తొలగింపు పనుల టెండర్లను సింగరేణి భారాస పాలనలో 20, కాంగ్రెస్ పాలనలో 5 కేటాయించింది.

ఇతర రాష్ట్రాల సంస్థల టెండర్లలోనూ సైట్ విజిట్ నిబంధన

నైనీ టెండర్ నోటిఫికేషన్‌లో సైట్ విజిట్ నిబంధన ఎందుకు పెట్టారని హరీశ్ అంటున్నారు. 2018, 2021, 2023 సంవత్సరాల్లో సెంట్రల్ మైన్స్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన మార్గదర్శకాల్లో టెండర్లలో ఈ నిబంధన పెట్టాలని సూచించినందునే నైనీకి కూడా సింగరేణి పెట్టింది. దానికి ముందు అనేక రాష్ట్రాలతో పాటు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల టెండర్ల నోటిఫికేషన్లలో కూడా ఇది ఉంది. ఈ నిబంధన పెట్టడం తప్పు కాకపోతే మరి నైనీ టెండర్ నోటిఫికేషన్‌ను ఎందుకు రద్దుచేశారని అందరూ అనవచ్చు. ఆరోపణలు రాగానే... వాస్తవాలు ప్రజలకు పూర్తిగా తెలియకుండా ఆ నోటిఫికేషన్‌ను కొనసాగిస్తే అడ్డగోలుగా ఊహించుకుంటారని వెంటనే రద్దుచేయాలని చెప్పా.

సృజన్‌రెడ్డి మామ ఉపేందర్‌రెడ్డి ఇప్పటికీ భారాసలోనే ఉన్నారు

పాత కాంట్రాక్టులన్నీ రద్దుచేసి సైట్ విజిట్ అనే నిబంధన పెట్టి సృజన్‌రెడ్డి అనే సీఎం బంధువుకి టెండర్లు కట్టబెడుతున్నారని



హరీశ్‌రావు అంటున్నారు. శోధా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి ఎండీగా దీప్తిరెడ్డి ఉన్నారు. ఆమె భారాస మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కుమార్తె. ఆయన 2018లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో నాతో పాటు ఉండాలి. కానీ కాంట్రాక్టులు, టెండర్లు అని ప్రలోభాలు చూపి ఉపేందర్‌రెడ్డిని భారాసలో చేర్చుకున్నారు. ఆయన అల్లుడు.. దీప్తిరెడ్డి భర్తనే ఈ సృజన్‌రెడ్డి. ఇప్పటికీ ఉపేందర్‌రెడ్డి భారాసలోనే ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దీంతో ఏం సంబంధం సైట్ విజిట్ సర్టిఫికెట్ తప్పనిసరి అనే నిబంధన పెట్టిన తరవాత ఇప్పటి వరకు 4 కంపెనీలకు మాత్రమే సింగరేణి టెండర్లను కేటాయించింది. శోధా కంపెనీకి వీకే ఓసీ గని-1 కాంట్రాక్టును ఇచ్చింది. మందమర్రి కళ్యాణఖని ఓసీ కాంట్రాక్టును 2025 మేలో ఎక్స్‌ప్రెస్‌వే ఆర్‌వీఎస్‌ఆర్ కంపెనీకి ఇచ్చింది. ఆర్‌వీఎస్‌ఆర్ అంటే ఆర్.విద్యాసాగర్‌రావు. ఎక్స్‌ప్రెస్‌వే కంపెనీ ఎండీ దీక్షిత్‌రావు. ఈ కంపెనీలు ఎవరివనేది ందరికీ తెలుసు. మొత్తం 12 మంది టెండర్లు వేయగా ఎవరికీ సైట్ విజిట్ సర్టిఫికెట్ ఇవ్వకుండా నిరాకరించలేదు. ఆర్‌జీ ఓసీ-2 ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు టెండర్‌ను సీ5 ఇంజినీరింగ్ ప్రైవేటు లిమిటెడ్‌కు 2025 జులై 4న ఇచ్చింది. ఈ కంపెనీ డైరక్టర్లు నిశాంత్‌రావు, మదన్‌మోహన్‌రావు. నిశాంత్‌రావు.. భారాస మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రావు కుమారుడు. ఎస్‌ఆర్‌పీ ఓసీ-2 ప్రాజెక్టు కోసం 12 మంది టెండర్లు వేయగా హర్ష కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కి దక్కింది. ఈ కంపెనీలో ఎవరెవరు ఉన్నారో, ఇది భారాస పాలనలో ఎన్ని నీటిపారుదల ప్రాజెక్టులు పొందిందో, ఎవరితో చేతులు కలిపిందో అందరికీ తెలుసు. సైట్ విజిట్ నిబంధన పెట్టి మాకు కావాల్సిన వాళ్లకే టెండర్లు ఇచ్చి ఉంటే ఈ కంపెనీలకు వచ్చేవా? ఇంత పారదర్శకంగా టెండర్లు కేటాయించినా విచారణ చేయాలని కేంద్రానికి లేఖ రాసి తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా హరీశ్‌రావు సింగరేణికి, తెలంగాణ ప్రజలకు నష్టం చేస్తున్నారు.

డీజిల్ కొనుగోలు నిబంధనలు భారాస హయాంలోనే మార్చారు...

సింగరేణి.. ఐవోసీ నుంచి డీజిల్ కొనుగోలు మానేసి ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇచ్చినట్లు హరీశ్‌రావు ఆరోపించారు. కాంట్రాక్టర్లు నడిపే వాహనాలకు సంస్థ డీజిల్ సరఫరా చేసే విధానం సింగరేణిలో తప్ప దేశంలో ఎక్కడా లేదు. డీజిల్ సరఫరాలో ఒకప్పుడు పెద్ద స్కాం జరిగింది. అందులో నిందితులు ఇప్పుడు ఎక్కడున్నారనే వివరాలు తరవాత చెపుతా. పాత విధానం మారుస్తామంటే దేశవ్యాప్తంగా ఎలా జరుగుతుంటే అలా చేయాలని చెప్పా. నైనీ గనిలో మట్టి తొలగించే పనుల కాంట్రాక్టు నిబంధనలు మార్చి డీజిల్ సరఫరా వ్యయం కూడా కాంట్రాక్టరే భరించాలని భారాస హయాంలోనే 24-7-2022న ఉత్తర్వులిచ్చారు.

బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలి...

బొగ్గుబావులపై ఏ రాబందులను, గద్దలను, ఏ పెద్దలను వాలనీయను. అదనంగా బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలి. గత పదేళ్లుగా కొత్త గనులు తెచ్చుకోలేదు. ఉత్పత్తి తగ్గిపోయి అంతిమంగా లాభాలు, ఆదాయం పడిపోయి సింగరేణిపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధిని కోల్పోయే ప్రమాదముంది. బొగ్గు నాణ్యత లేకపోతే వాడకం కూడా తగ్గే ప్రమాదముంది. నాణ్యమైన బొగ్గు గనులను తెచ్చుకుని ఈ సింగరేణిని బతికించుకోవాలి. రాజకీయ లబ్ధి కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో సింగరేణిపై విషం చిమ్మవద్దు. ఏమైనా అనుమానాలుంటే నా తలుపులు అన్నివేళలా తెరిచే ఉంటాయి. ఏం అడిగినా చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నా" అని భట్టి అన్నారు.

# ఓటు హక్కు వజ్రాయుధం

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా రెవెన్యూ అధికారి మంగిలాల్





**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి :** ప్రజాస్వామ్య ములో ఓటు హక్కు వజ్రాయుధమని , 18 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా రెవెన్యు అధికారి మంగిలాల్ అన్నారు.ఆదివారము వికారాబాద్ జిల్లా కల్లెక్టేట్ కార్యాలయ ఆవరణలో 16 వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురష్కరించుకొని ర్యాలి నిర్వహించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు, ఓటర్ల అందరిచే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు అనంతరం 16 వ జాతీయ ఓటరు దినోత్సవము సందర్బంగా సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన సమావేశములో జిల్లారెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అందరు ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కుపై అవగాహనా కలిపించికోవాలని సూచించారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన ఎనిమిది మందికి ఓటు హక్కు కలిపిస్తూ ఎపిక్ కార్డ్స్ పంపిణి చేశారు ప్రజాస్వామ్యములో 85 సంవత్సరాల నుండి ఓటు హక్కు వినియోగించుకున్నఐదు మంది సీనియర్ సిటిజన్స్ కు ఈ సందర్భంగాశాలువా లతో సన్మానం చేశారు. ఓటరు అవగాహనా కార్యక్రమాలలో గెలుపొందిన వారికీ సర్టిఫికేట్ లు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా స్వీప్ అధికారి సత్తార్ , తహసిల్దార్ లక్ష్మినారాయణ, జిల్లా వైద్యాది కారి స్వర్ణ కుమారి, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ అలీ , సిబ్బంది ,వెంకటేష్ ,అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సప్త వాహన సేవలో అనంతపద్మనాభుడు





**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి :** రథసప్తమి సందర్భంగా అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి సప్తవాహన సేవలు రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో సప్తవాహన సేవలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఉదయం 7:30 గంటలకు సూర్యప్రభ వాహనంపై శ్రీ అనంత పద్మనాభ స్వామిని ఊరేగింపుగా నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి నరేందర్, అర్చకులు శేషగిరి పంతులు, అనంతగిరి పంతులు, నిఖిల్ బసవలింగం తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కూక్ మండల అధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ ,





**అక్షర విజేత గజ్వేల్:** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన బొమ్మని రాజమ్మ 65 రామిడ్ల నర్సయ్య 75 అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందారు.ఆదివారం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కూక్ మండల అధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ , బాదిత కుటుంబ సభ్యులను వేరువేరుగా పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట చేబర్తి సర్పంచ్ ర్యాకం యాదగిరి ,చేబర్తి మాజీ సర్పంచ్ అశోక్ ,మర్కూక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ గుర్రాల స్వామి,నాయకులు టప్ప రాజు,దయాకర్,ద్యాకం బాలనర్సయ్య, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివదీక్షలు

ఓం నమః శివాయ! ఓం నమః శివాయ! మారుమోరోగిన శివాలయం



**అక్షర విజేత,రాయికల్:** రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని స్థానిక శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు శివదీక్ష మాలధారణ ను పండితులు అంగడి భూమేశ్వర్ స్వామి,అర్చకులు గురులింగు మఠం విక్రమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు శివదీక్ష స్వీకరించి 41 రోజులు కఠిన నియమాలతో ప్రతినిత్యం శివుని అభిషేకం,అర్చన, భజన చేస్తూ భక్తిశ్రద్ధలతో పూజిస్తూ దీక్ష కొనసాగుతుందని, శివదీక్ష మాలదారుల భిక్ష(భోజనం) కొరకు అన్నదాన వెల్ఫేర్ ట్రస్టు ఏర్పాటు చేయడం జరిగిందని, శివదీక్ష సీనియర్ స్వామి చిట్యాల భూమయ్య, నామని లక్ష్మీ నర్సయ్య తెలిపారు. ప్రతి సోమ,శనివారం ఆలయంలో హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం కొనసాగుతోందన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి



జాతీయ ఓటరు దినోత్సవంలో వక్తల పిలుపు

ఓటింగ్ లో పాల్గొని భవితను నిర్దేశించుకోవాలని హితవు







**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును ఓటర్లు తప్పక వినియోగించుకోవాలని వక్తలు సూచించారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అంకిత్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అనంతరం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సందేశం వినిపించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తోందని గుర్తు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తోందని, ప్రతీసారి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ప్రజలలో చైతన్యాన్ని పెంపోందిస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే ఈసారి మై ఇండియా - మై ఓటు నినాదంతో ఓటర్లను చైతన్య పరుస్తోందని అన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో మనకు నచ్చిన నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారానే సాధ్యమని సూచించారు. పలు దేశాలలో ఓటింగ్ లేకుండా నియంతృత్వ పాలన జరుగుతోందని, అందుకు భిన్నంగా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ భారత దేశంలో స్థానిక సంస్థలు మొదలుకుని పార్లమెంటు వరకు క్రమం తప్పకుండా పకడ్బందీగా ఎన్నికలు జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో, మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటూ ఎంతో కీలకమైనదని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. అప్పుడే ప్రజాస్వామ్యం మరింతగా పరిఢవిల్లుతుందని సూచించారు. స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం 1951లో అక్షరాస్యత తక్కువ ఉన్న సమయంలోనూ అందరినీ ఓటింగ్ లో భాగస్వామ్యం చేసేందుకు అప్పటి భారత ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ నేతృత్వంలో ఎలక్షన్ సింబల్ ను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, రానున్న మున్సిపల్ ఎన్నికలను కూడా అదే స్ఫూర్తితో నిర్వహించాలని, ఓటర్లు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 18 ఏళ్ళు నిండిన వెంటనే ఓటరుగా నమోదు అయ్యేలా ఎలక్షన్ కమిషన్ యువతకు వెసులుబాటు కల్పించిందని సూచించారు. ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిరణ్ కుమార్ మాట్లాడుతూ, జాతి, కుల, మత, లింగ, వర్గ భేదాలు, బడుగు, బలహీన వర్గాలు అనే తేడా లేకుండా పద్దెనిమిదేళ్లు దాటిన పౌరులందరికీ రాజ్యాంగం ఓటు హక్కును ప్రసాదించిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధంతో ఓటర్లు తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం కల్పించినందున, ఈ హక్కును ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఔన్నత్యం గురించి యువత ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో క్రమం తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్లను, కొత్తగా నమోదైన యువ ఓటర్లను జిల్లా యంత్రాంగం తరపున జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. కొత్త ఓటర్లకు ఎన్నికల గుర్తింపు కార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయాగౌడ్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, నార్త్ తహసీల్దార్ విజయ్ కాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, విద్యార్థిని, విద్యార్థులు, అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ పేరుతో రాజకీయం చేస్తే సహించేది లేదు

చిట్యాల బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్



**అక్షరవిజేత, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనవరి, 25) :** పేద ప్రజలకు మేలు చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యం లోని కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చిట్యాల, బీజేపీ మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్. అన్నారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని బుర్ర వెంకటేష్ గౌడ్ విలేకరులతో మాట్లాడారు ఉపాధి హామీ పథకం లో చాలా లోటుపాట్లు ఉన్నాయని వాటిని సవరించకపోవడం వల్ల పథకం ఉద్దేశ్యం నీరుగారిపోతుందని అన్నారు. 100 రోజుల గ్యారంటీ తో పనులు చేయాలని చట్టంలో ఉన్నా కూడా అమలు పరచడం లో స్థానిక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. పనులు చేసిన కూలీలకు సరైన సమయానికి డబ్బులు చెల్లించకపోవడం పై జవాబుదారీతనం లేదని అన్నారు .వ్యవసాయ పనులున్న సమయం లో ఉపాధి పనులు చేయడం వల్ల కూలీలకు, మరియు రైతులకు చాలా ఇబ్బందులు జరుగుతున్నప్పటికి ఈ విషయం పై గతం లోని ప్రభుత్వం అనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యుపిఏ ప్రభుత్వం పట్టించుకోకపోవడం తో ప్రజలకు ఇబ్బందిగా మారిందని అన్నారు.ఈ సమస్య లపై దృష్టి సారించిన మన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని సవరణ చేయాల్సివచ్చిందని తెలిపారు. 100 రోజుల నుండి 125 రోజులకు పనులు కల్పించడం, అట్టి పనులకు సంబందించిన కూలీల డబ్బులను కూడా సరైన సమయం లో చెల్లించేలా చట్టసవరణ చేశారని అన్నారు. మహాత్మా గాంధీ పేరుతో రాజకీయం చేసేది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. నరేంద్ర మోదీ సారథ్యం లోని కేంద్ర ప్రభుత్వం స్వచ్ భారత్ లాంటి పథకాలకు మహాత్మా గాంధీ పేరును పెట్టిన విషయాన్ని గుర్తుచేసుకోవాలని అన్నారు. రోజువారీ కూలీపై ఆదారపడి పనిచేసుకునే కూలీలకు న్యాయం చేసేవిధంగా వికసిత్ భారత్ లో భాగంగా వీబి రాం జి గార్పిడి చేయడం జరిగింది. కానీ గ్రామీన్ పథకం పై తప్పుడు ప్రచారం చేయవద్దని సూచించారు.పథకం పై విస్తృతమైన ప్రచారం చేయాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలు పై కూడా ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మండల మొగిలి,గుండసురేష్, గుర్రపు రవి,చింతల రాజేందర్,బుర రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి రాయికల్ తహసిల్దార్ నాగార్జున

16వ జాతీయ ఓటరు దినోత్సవం

ఓటింగ్ లో పాల్గొని భవితను నిర్దేశించుకోవాలని హితవు







**అక్షరవిజేత, రాయికల్ :** రాయికల్ పట్టణ కేంద్రంలో స్థానిక శివాజీ విగ్రహం వద్ద 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎమ్మార్వో నాగార్జున ఆధ్వర్యంలో విద్యార్థులతోర్యాలీ, మానవహార కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా రాయికల్ ఎమ్మార్వో నాగార్జున మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కును ఓటర్లు తప్పక వినియోగించుకోవాలని . పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావాలని రాయికల్ తహసిల్దార్ నాగార్జున సూచించారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తోందన్నారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తోందని, ప్రతీసారి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ప్రజలలో చైతన్యాన్ని పెంపోందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఈసారి మై ఇండియా - మై ఓటు నినాదంతో ఓటర్లను చైతన్య పరుస్తోందని స్వేచ్ఛాయుత వాతావరణంలో మనకు నచ్చిన నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారానే సాధ్యమని సూచించారు. పలు దేశాలలో ఓటింగ్ లేకుండా నియంతృత్వ పాలన జరుగుతోందని, అందుకు భిన్నంగా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ భారత దేశంలో స్థానిక సంస్థలు మొదలుకుని పార్లమెంటు వరకు క్రమం తప్పకుండా పకడ్బందీగా ఎన్నికలునిర్వహించుకుంటున్నాం . ప్రజాస్వామ్య పరిరక్షణలో, మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటూ ఎంతో కీలకమైనదని, అప్పుడే ప్రజాస్వామ్యం మరింతగా పరిఢవిల్లుతుందని, స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం 1951లో అక్షరాస్యత తక్కువ ఉన్న సమయంలోనూ అందరినీ ఓటింగ్ లో భాగస్వామ్యం చేసేందుకు అప్పటి భారత ఎన్నికల కమిషనర్ ఎలక్షన్ సింబల్ ను ప్రవేశపెట్టారని ఈపారు.రానున్న మున్సిపల్ ఎన్నికలను కూడా అదే స్ఫూర్తితో నిర్వహించాలని, ఓటర్లు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.18 ఏళ్ళు నిండిన వెంటనే ఓటరుగా నమోదు అయ్యేలా ఎలక్షన్ కమిషన్ యువతకు వెసులుబాటు కల్పించిందని సూచించారు. ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ఓటు వేయాలని జాతి, కుల, మత, లింగ, వర్గ భేదాలు, బడుగు, బలహీన వర్గాలు అనే తేడా లేకుండా 18ఏళ్ళు దాటిన పౌరులందరికీ రాజ్యాంగం ఓటు హక్కును ప్రసాదించిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధంతో ఓటర్లు తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం కల్పించినందున, ఈ హక్కును ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఔన్నత్యం గురించి యువత ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తహసిల్దార్ నాగార్జున పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాఘవులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య,జిపిఓలు, బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, ఓటర్లు పాల్గొన్నారు.

# పోచారం చిల్లర వ్యాపారులకు ఊరట

ఇక తై బజార్ పన్ను చెల్లింపులు అవసరం లేదు..

అక్రమ వసూళ్లకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలవాలని

చిల్లర వ్యాపారదారుల యూనియన్ పిలుపు.



**అక్షర విజేత, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని పోచారం మున్సిపల్ పరిధిలోని చిల్లర వ్యాపారులు, కూరగాయల విక్రేతలకు ఊరట కలిగించే అంశం వెలుగులోకి వచ్చింది.జిహెచ్ఎంసి హైదరాబాద్?లో పోచారం ప్రాంతం విలీనం అయినప్పటి నుంచి తై బజార్ పన్ను వసూలుకు ఇప్పటివరకు ఎలాంటి టెండర్ ప్రక్రియ చేపట్టలేదని చిల్లర వ్యాపారదారుల యూనియన్ స్పష్టం చేసింది.ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ లేకుండా పన్ను వసూలు చేయడం చట్ట విరుద్ధమని, ఈ పరిస్థితుల్లో తై బజార్ పేరుతో డబ్బులు వసూలు చేసే వారికి ఎలాంటి చట్టబద్ధమైన అధికారాలు లేవని యూనియన్ పేర్కొంది.అందువల్ల ఇకపై చిల్లర దుకాణాలు, కూరగాయల వ్యాపారులు తై బజార్ పన్ను పేరుతో ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని యూనియన్ స్పష్టం చేసింది.జిహెచ్ఎంసిలో విలీనం తర్వాత టెండర్ ప్రక్రియ లేమి ఒకప్పుడు పోచారం మున్సిపల్ కార్పొరేషన్?గా ఉన్న ప్రాంతాన్ని జిహెచ్ఎంసి పరిధిలోకితీసుకువచ్చినప్పటికీ, తై బజార్ పన్ను వసూలుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక టెండర్?ను పిలవలేదని యూనియన్ వెల్లడించింది.టెండర్ లేకుండా, అధికారిక ఉత్తర్వులు లేకుండా పన్ను వసూలు చేయడం చట్టబద్ధం కాదని యూనియన్ అభిప్రాయపడింది.గెజిట్ నోటిఫికేషన్ లేకుండా వసూళ్లు అక్రమంతై బజార్ పన్ను వసూలుకు సంబంధించి ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ వెలువడలేదని, ఎవరికి కూడా అధికారిక అనుమతులు ఇవ్వలేదని యూనియన్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తై బజార్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులు లేదా గుంపులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేవని స్పష్టంగా తెలిపింది.డబ్బులు అడిగితే చెల్లించాల్సిన అవసరం లేదు.ఇకనుంచి చిల్లర దుకాణాలు, కూరగాయల వ్యాపారులు తై బజార్ పన్ను పేరుతో డబ్బులు చెల్లించవద్దని యూనియన్ పిలుపునిచ్చింది.అక్రమంగా వసూలు చేయడానికి ప్రయత్నిస్తే నిలదీయాలని, అవసరమైతే సూటిగా తిరస్కరించాలని సూచించింది.అక్రమ వసూళ్లపై ఫిర్యాదులు చేయాలి.తై బజార్ పన్ను పేరుతో డబ్బులు వసూలు చేసినట్లయితే, వాటిని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని యూనియన్ సూచించింది.అదే విధంగా మీడియాకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చింది.ఐక్యతతోనే హక్కుల పరిరక్షణచిల్లర వ్యాపారులు అందరూఒక యూనిట్?గా ఐక్యంగా నిలబడాలని యూనియన్ పిలుపునిచ్చింది.ఎవరైనా డబ్బులు అడిగితే వ్యక్తిగతంగా కాకుండా సమిష్టిగా ప్రశ్నించాలని, భయపడకుండా తమ హక్కుల కోసం నిలబడాలని పేర్కొంది.యూనియన్ తుది స్పష్టీకరణతై బజార్ వేలం నిర్వహించి, అధికారిక టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసే వరకు ఎలాంటి పన్ను చెల్లింపుల అవసరం లేదని చిల్లర దుకాణ వ్యాపారదారుల యూనియన్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

# నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా చింతారెడ్డి గోపిరెడ్డి ఎన్నిక

ప్రధాన కార్యదర్శిగా గులాం హుస్సేన్





**అక్షర విజేత... చింతలపాలెం :** చింతలపాలెం మండల కేంద్రంలో నూతన ప్రెస్ క్లబ్ ను అధికారికంగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల్లో ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా చింతారెడ్డి గోపిరెడ్డి ను అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షులుగా.బాణావత్ రమణ, రాకేష్,ఎన్నుకోవడం జరిగింది, ప్రధాన కార్యదర్శిగా షేక్ గులాబ్ హుస్సేన్, సహాయ కార్యదర్శి, షేక్ అబ్దుల్, కోశాధికారిగా రాజశేఖర్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా యర్రపాటి ప్రసాద్, గౌరవ సలహాదారులుగా షేక్ మక్బూల్ పాషా పత్రికా విలేకరుల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది

# మన ఓటే మన వజ్రాయుధం





**అక్షరవిజేత,రాయికోడ్:** సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తహశీల్దార్ కార్యాలయం నుంచి అధికారులు, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు ఓటు హక్కు మన జన్మ హక్కు,సక్రమంగా ఓటు హక్కును వినియోగించుకో సరైన నాయకుడిని ఎన్నుకో అంటూ నినాదాలు చేస్తూ వీరభద్రేశ్వర కమన్ వద్ద ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు, ఈ సందర్భంగా మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్,ఏఎస్సై యాదగిరి,నాయకులు మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని,మన ఒక్క ఓటు సమాజం మార్పుకు ఎంతో దోహదం చేస్తుందని,అలసత్వంతో నా ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుంది అనుకుంటే ప్రశ్నించే హక్కు కోల్పోతావు అలాగే ఒక్క ఓటు అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయిస్తుంది కాబట్టి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని అలాగే తమ ఓటు హక్కును ఎన్నికల్లో మందు సీసాకు,పచ్చ నోటుకు అమ్ముకోకుండా అందరూ ఒక వజ్రాయుధం లాంటి ఓటును సక్రమంగా వేయాలని తెలిపారు.

# పిట్లం లంబాడీల ఐక్యవేదిక మండల కమిటీ ఎన్నిక



**అక్షర విజేత పిట్లం 25 :** లంబాడీల ఐక్యవేదిక మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఆర్అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్ కాట్రోత్ రవీందర్ నాయక్ నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. అధ్యక్షుడిగా నునావత్ శ్రావణ్, ప్రధాన కార్యదర్శిగా లావుడియా శంకర్, ఉపాధ్యక్షులుగా కాట్రోత్ టోప్యా నాయక్, ప్రేమ్ సింగ్, రాంజీలు ఎన్నికయ్యారు. గిరిజనుల హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవం

ఓటు హక్కు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత.





**అక్షర విజేత,బజార్ హత్నూర్ ప్రతినిధి:** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం నుంచి ప్రాథమిక చికిత్స కేంద్రం వరకు ఈ ర్యాలీ సాగింది. ఎన్నికల సమయంలో ప్రతి పౌరుడు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ప్రజలకు తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ ర్యాలీలో ఎమ్మార్వో, ఆర్?ఐతో పాటు మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. ఓటు హక్కు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత, ప్రజాస్వామ్యం బలోపేతానికి ఓటు అవసరం వంటి నినాదాలు చేస్తూ ర్యాలీ ముందుకు సాగింది. అధికారులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయడం ద్వారా మంచి పాలనకు దోహదపడతారని తెలిపారు. ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన ప్రతి ఓటరు పోలింగ్ రోజున ఓటు వేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు కూడా తమ మద్దతు తెలుపుతూ ర్యాలీలో పాల్గొనడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా ఓటింగ్ శాతం పెరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి



**అక్షర విజేత, చేవెళ్ల :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే నేను వద్దన్నాను అంటూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆదివారం విలేకరులకు అందజేసిన ఒక ప్రకటనలో ఆయన మహేష్ కుమార్ గౌడ్ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక, రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించలేక కాంగ్రెస్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత నుండి దృష్టి మళ్లించడానికే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపారని విమర్శించారు. తెలంగాణ జాగృతి త్వరలో రాజకీయ పార్టీగా అవతరించబోతున్న తరుణంలో, ఆ సంస్థకు వస్తున్న ప్రజాదరణను చూసి భయపడి మహేష్ కుమార్ గౌడ్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పార్టీని చక్కదిద్దుకోలేక, సొంత నాయకత్వాన్ని సమన్వయం చేయలేక సతమతమవుతున్న పీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను గమనించాలని హితవు పలికారు. బురద జల్లే రాజకీయాలు మానుకొని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ఉనికి కోసమే ఆరాటం: ప్రజల అభిమానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ, తన ఉనికిని కాపాడుకోవడానికి లేనిపోని అబద్ధాలను ప్రచారం చేస్తోందని, ఇలాంటి చౌకబారు విమర్శలను తెలంగాణ ప్రజలు నమ్మరని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతికి ఉన్న నైతిక బలాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదని, ఇకనైనా అర్థరహితమైన వ్యాఖ్యలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

# భూ' కబ్జా కేసులో.. అలిముద్దీన్కు అరెస్ట్ వారెంట్..!



నిందితుడిని వెదకుతున్న చేవెళ్ల పోలీసులు

**అక్షర విజేత,చేవెళ్ల :** చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబర్ 79లో చేవెళ్లకు చెందిన మహమ్మద్ సఫియోద్దీన్ 2019లో 1.13 ఎకరాలు అదే గ్రామానికి చెందిన కొందరి రైతుల వద్ద కొనుగోలు చేశారు. ఈ పొలంలో రాకపోకల సౌలభ్యం కోసం ఉత్తర భాగం నుంచి దక్షిణ భాగం వరకు కొంత దూరం వరకు మట్టి రోడ్డు వేశారు. పట్టాదారు మహమ్మద్ షఫియోద్దీన్ కేసారం గ్రామానికి చెందిన కాసుల అంజన్ కుమార్ గౌడ్కు 2001 మే 10న అగ్రిమెంట్ చేశారు. ఇదిలా ఉండగా.హైదరాబాద్కు చెందిన మహమ్మద్ అలిముద్దీన్ అనే రియల్ వ్యాపారి ఈ భూమిపై కన్ను పడింది. ఎలాగైనా ఈ భూమిని కబ్జా చేయాలని చూశారు. 2021 డిసెంబర్ 22న సాయంత్రం 5 గంటల సమయంలో కొంత మంది దుండగులతో వచ్చి ఖాళీగా ఉన్న పొలంలో ఓ ఇనుప కంటైనర్ను అక్రమంగా దింపాడు. విషయాన్ని తెలుసుకున్న అగ్రిమెంట్ దారులు అక్కడికి చేరుకున్నారు. ఈ పొలం మేము చేవెళ్ల వాసి నుంచి అగ్రిమెంట్ చేసుకున్నాము.. నీ వద్ద ఏమైనా డాక్యుమెంట్స్ ఉంటే చూపించాలని పేర్కొన్నారు. ఇవేమి పట్టించుకోకుండా అలిముద్దీన్ అగ్రిమెంట్ దారులను బెదిరింపులకు గురిచేశారు. ఆ సమయంలో ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. విషయం తెలుసుకున్న పట్టాదారు మహమ్మద్ షఫియోద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని విషయాన్ని తెలుసుకున్నారు. అనంతరంస్థానిక పోలీస్స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు కేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు మహమ్మద్ అలిముద్దీన్ పై (ఎఫ్ఐఆర్ నెంబర్ 608/2021) కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీటు (సిసినెం.193/2022) దాఖలు చేశారు. ఈ కేసులో మహమ్మద్ అలిముద్దీన్ తప్పించు తిరుగుతున్నారు. కేసు విచారణకు సంబంధించి చేవెళ్ల కోర్టులో హాజరు కాకపోవడంతో చేవెళ్ల జూనియర్ సివిల్ జడ్జి ఈనెల 22న (ఎన్.బి.డబ్ల్యు) నాన్బేలేబుల్ వారెంట్ జారీ చేశారు. పోలీసులు నిందితుడు మహమ్మద్ అలిముద్దీన్ కోసం వెదకుతున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసు విషయంలో పట్టాదారు మహమ్మద్ షఫియోద్దీన్ తనకు అలిముద్దీన్తో ప్రాణహాని ఉందని 2022 ఫిబ్రవరి 11న సైబరాబాద్ కమిషనర్లో ఫిర్యాదు చేశారు.

# ప్రజా సమస్యలపై పోరాడే నాయకులనే గెలిపించండి

ఎం సిపిఐయు పార్టీ నాయకులనే గెలిపించండి

హామీలు ఇచ్చి నిలబెట్టుకొని అధికార పార్టీ నాయకులను చిత్తుచిత్తుగా ఓడించండి

ఎం సి పి ఐ యు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ విజ్ఞప్తి

**అక్షర విజేత బెల్లంపల్లి :** ఏం సిపిఐయు పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ప్రజల కోసం కేసులు సైతం లెక్కచేయకుండా ప్రజల వెంటే ఉంటూ ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతున్న ఎంసీపీఐయు నాయకులను గెలిపించాలని దాదాపు 8 వార్డులలో ఎం సిపిఐయు పార్టీ పోటీలో ఉంటుందని అదేవిధంగా సెంటర్లో దీఫీా గతంలో దీతీం ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఎలుగపెట్టింది ఏమీ లేదని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ఇంటింటి మహిళకు 2500 రూపాయలు ఇస్తానని, వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు పెన్షన్లు,పెంచుతామని కల్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని దొంగ మాటలతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు ఇప్పుడు మళ్లీ మేము పోటీలో ఉంటున్నామని ప్రజలకు అండగా ఉంటామని హామీలు నెరవేరుస్తామని కల్లిబొల్లి మాటలతో గల్లి గల్లి తిరుగుతూ వంగి వంగి దండాలు పెడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారు ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చింది అందుకని ప్రజల మధ్యలో ఉంటూ నిత్యం ప్రజా సమస్యలకోసం పోరాడుతున్న ఎం సి పి ఐ యు పార్టీ నాయకులను బెల్లంపల్లి పట్టణ మున్సిపాలిటీలో వార్డు కౌన్సిలరు లు గా గెలిపించగలరని బెల్లంపల్లి పట్టణ ప్రజలందరికీ విప్లవ అభివందనాలు తెలియజేస్తున్నాం





# భక్తులకు అసౌకర్యం కలిగించవద్దు

రామప్ప దుకాణదారులకు ఎస్సై కౌన్సిలింగ్

320 పోలీసు సిబ్బందితో రామప్పలో భారీ భద్రత

వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు



**అక్షర విజేత వెంకటాపూర్ (రామప్ప) :** వెంకటాపూర్ (రామప్ప) రామప్పలో చిరు దుకాణదారులు దేవాలయానికి దర్శించుకునే భక్తులకు ఎటువంటి అసౌకర్యానికి గురి చేయవద్దని ఎస్సై చల్ల రాజు కోరారు. ఆదివారం దుకాణదారులతో మాట్లాడుతూ రోడ్డుమీద ఇరువైపులా ఆటో రిక్షాలు, తోపుడుబండ్ల ద్వారా దుకాణాలను ఏర్పాటు చేసుకుని భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వాటిని తొలగించారు. మళ్లీ పునరావృతం అయితే కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. మేడారం జాతర సందర్భంగా రామప్పలో లక్షల మంది భక్తులు వస్తారని అందుకోసం 320 పోలీసు సిబ్బందితో పాటు ఒక డిఎస్పి, నలుగురు సిఐలు, 12 మంది ఎస్ఐ,లతో భారీ భద్రత ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం సాయంత్రం నుండి పోలీస్ సిబ్బంది విధులలో పాల్గొంటారని అన్నారు. భక్తుల భద్రత దృశ్య రామప్ప చెరువు కట్ట మీదికి అనుమతి లేదని ఎస్ఐ చల్లరాజు తెలిపారు.

# స్నేహితుడి కుటుంబానికి చేయూత



**అక్షర విజేత, పెద్ద శంకరంపేట్:** మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన మంగలి వెంకటేశం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులు ముందుకు వచ్చారు. గత కొన్ని నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశం హైదరాబాద్?లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈమధ్య మృతి చెందారు. చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఆయన ప్రాణాలను కాపాడలేకపోయారు.వెంకటేశానికి నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు ఉండగా, అందులో చిన్న కూతురు , కొడుకులకు ఇంకా వివాహం కాలేదు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరు అయిన వెంకటేశం మృతి చెందడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ విషయం తెలుసుకున్న వెంకటేశం చదువుకున్న 1984 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు మానవత్వాన్ని చాటుకున్నారు. మిత్రులంతా కలిసి చందా సేకరించి రూ.40 వేల నగదును వెంకటేశం భార్యకు అందజేశారు. కష్టకాలంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు ప్రశంసించారు.

# గ్రామదేవతల చలి బోనాల పండగ... బోనమెత్తిన మహిళలు



**అక్షరవిజేత మామడ:** గ్రామదేవతలైన పోచమ్మ,మైసమ్మ,ముత్యాలమ్మ,పెద్దమ్మలకు సమర్పించే చలిబోనాల వేడుకలు ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా ప్రారంభమైనాయి. సువాసినులు ముందురోజు రాత్రి తలస్నానం ఆచరించి కొత్త కుండలో బెల్లం పాయసం వండి, మరుసటి రోజు ఆ చలిబోనాన్ని గ్రామదేవతలకు సమర్పించడం నాటి నుండి ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో ఆదివారం విశేష సంఖ్యలో మహిళలు చలిబోనాలతో గ్రామదేవతల ఆలయాలకు పోటెత్తారు. చలిబోనం స్వీకరించి చల్లగ మమ్ము చూడమ్మా అంటూ భక్తి శ్రద్దలతో అమ్మవార్ల ఆలయాల్లో పూజలు చేశారు. అంటువ్యాధులు, అనారోగ్యాలు ప్రబలకుండా గ్రామ ప్రజలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



**అక్షర విజేత, కోహెడ ప్రతినిధి:** కోహెడ గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యం లో వినాయక డెంటల్ హాస్పిటల్ హుస్నాబాద్, ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపు లో దాదాపు100 మందికి ఉచిత పరీక్ష చేసి డాక్టర్లు సూచించిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్ మాట్లాడుతూ. వినాయక డెంటల్ హాస్పిటల్ అందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న హాస్పిటల్ అని ఎల్లవేళలా అందుబాటులో వైద్య సేవలు అందిస్తున్నారని ప్రజలు అందరూ వినియోగించు కోవాలని కోరారు. వినాయక డెంటల్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ సురేష్, నరేష్ మాట్లాడుతూ ఈ క్యాంపులో అనుభవజ్ఞులైన డాక్టర్లచే పళ్లకు సంబందించిన వైద్య పరీక్షలు నిర్వహించామని, ఈ క్యాంపును సద్వినియోగం చేసుకున్నందుకు కోహెడ గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కోహెడ మండల ప్రజలు మా యొక్క ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, పాలకవర్గానికి సన్మానం చేశారు. వినాయక డెంటల్ హాస్పిటల్ వైద్య నిపుణులు సురేష్, నరేష్ స్టాఫ్ హర్షవర్ధన్, సాగర్ మాజీ సర్పంచ్ గోరిట్యాల లక్ష్మణ్, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంతంలో జంతుగణన పూర్తి అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ భూమేష్







**అక్షరవిజేత,రాయికల్ :** ప్రతి 4 సంవత్సరాలకు ఒకసారి జరిగే అడవి జంతువుల గణన ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేట్ 2026 లో భాగంగా జనవరి 20 తేదీ నుండి26 వరకు రాయికల్ అటవీ శాఖ రేంజ్ ఆధ్వర్యంలో జరిగిన జంతు గణన ఆదివారంతో ముగిసింది. రేంజ్ ఆఫీసర్ భూమేష్ ఆధ్వర్యంలో జంతు గణన నిర్వహించగా కొండగొర్రె, మనుపోతు జంతువులకు సంబంధించిన ఆనవాళ్లు అధికారులు గుర్తించామని, ఈ సర్వే ఆధారంగా అడవిలో ఉన్న జంతువుల వివరాలు పూర్తిస్థాయిలో ప్రత్యేక యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అటవీలో జంతుగణన ప్రతిరోజు 5 కిలోమీటర్ల పరిధిలో ఉదయం సాయంత్రం వరకు రెండుసార్లు జంతువుల యొక్క పాదముద్రలు,చెట్లకు గీరిన గొర్ల గుర్తులు, మలం ఆధారంగా గుర్తించి జంతుగణన ప్రత్యేక యాపులో నమోదు చేస్తున్నామని దీనివల్ల అడవిలో ఉన్న జంతువుల వివరాలు పూర్తిగా తెలుస్తాయని రేంజ్ ఆఫీసర్ భూమేష్ అన్నారు. కార్యక్రమంలో అధికారులు బీట్ ఆఫీసర్స్,వాలంటీర్స్,వాచర్స్ వాలంటీర్ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు ద్వారానే సుస్థిరమైన ప్రభుత్వం సబ్ కలెక్టర్ మనోజ్

## జాతీయ ఓటరు దినోత్సవంలో ప్రజాస్వామ్య విలువలపై అవగాహన

**అక్షర విజేత బెల్లంపల్లి :** వేసే ఒక్క ఓటు ద్వారానే సుస్థిరమైన, బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఏర్పడుతుందని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించి నచ్చిన వ్యక్తిని చట్టసభలకు ఎన్నుకోవడం ద్వారా దేశ భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారన్నారు. ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ఎలాంటి భయభ్రాంతులు లేకుండా నిర్వహించడమే ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్నారు. ఎమ్మార్వో మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియలో యువత చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాక బాధ్యత కూడా అని తెలిపారు. ప్రజలు తమ ఓటు విలువను గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా ఓటు వేయాలని కోరారు. మెండల్ విద్యాధికారి (ఎంఈఓ) మాట్లాడుతూ, విద్యార్థుల నుంచే ప్రజాస్వామ్య విలువలు అలవర్చాలని అన్నారు. పాఠశాల స్థాయిలోనే ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులు తయారవుతారని చెప్పారు. యువత ఓటు హక్కు వినియోగంలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సబ్ కలెక్టర్ మనోజ్



ఎమ్మార్వో ఎల్ కృష్ణ , ఎంఈఓ పోశయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు.

# కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విశిష్ట గౌరవం




**అక్షర విజేత, కరీంనగర్ ప్రతినిధి:** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి వేడుకల్లో కరీంనగర్ జిల్లాకు మరో విశిష్ట గౌరవం దక్కింది. ఎన్నికల నిర్వహణలో వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలు, శిక్షణ, సామర్థ్యాభివృద్ధి రంగంలో చేసిన ఉత్తమ కృషికి గాను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ దిశా నిర్దేశంలో ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం, సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టడం ఈ అవార్డుకు ప్రధాన కారణంగా నిలిచాయి. అలాగే, వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం విశేషంగా కృషి చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ. జిల్లా యంత్రాంగం, ఎన్నికల అధికారులు, సిబ్బంది అందరి సమష్టి కృషి వల్లే ఈ అవార్డు సాధ్యమైంది అని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన ప్రతి ఒక్క అధికారికి అభినందనలు తెలిపారు. ఈ అవార్డు జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, సుశిక్షిత సిబ్బందితో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించగల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని అధికారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# కంటోన్మెంట్ విలీన పోరాటం స్వతంత్ర పోరాటంతో సమానం









**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్?లో విలీనం చేయాలనే డిమాండ్?తో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపట్టిన రిలే నిరహార దీక్ష ఆరో రోజుకు చేరుకుంది. ఈ దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి గీతా రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్?పర్సన్ వెన్నెల గద్దర్, టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. నియోజకవర్గంలోని యువత పెద్ద ఎత్తున ర్యాలీగా పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి గీతా రెడ్డి, కంటోన్మెంట్ విలీన పోరాటం మరో స్వతంత్ర పోరాటంలాంటిదేనని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ప్రజల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, నామినేటెడ్ వ్యవస్థతో ప్రాంతాన్ని నడపడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన సర్వీస్ ఛార్జీలుగా సుమారు రూ.1200 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉన్నప్పటికీ ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. మన డబ్బులతో మనపైనే రాచరిక పాలన సాగించే వ్యవస్థ అవసరం లేదని స్పష్టం చేస్తూ, కంటోన్మెంట్ ప్రాంత ప్రజల ఆకాంక్ష విలీనమేనని అన్నారు. అలాగే కంటోన్మెంట్ ప్రజల ఓట్లతో ఎన్నికైన ఎంపీ ఈటెల రాజేందర్ స్థానిక ప్రజల భావోద్వేగాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బోర్డు విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకులు కోరారు. దీక్షకు




రోజురోజుకు పెరుగుతున్న మద్దతు కంటోన్మెంట్ ప్రాంత ప్రజల ఆవేదనను స్పష్టంగా ప్రతిబింబిస్తోందని వారు పేర్కొన్నారు.


# రిపబ్లిక్ డే వేడుకకు ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్







**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉదయం 9.00 గంటలకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. రిపబ్లిక్ డే వేడుకకు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇటీవలే అధికారులతో నిర్వహించిన సమీక్షలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. వేదిక, ఎగ్జిబిషన్ స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్ల గురించి సంబంధిత శాఖల అధికారులతో ఐ.డీ.ఓ.సీలో సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు పోలీస్ పరేడ్ మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.



# పలు శుభ కార్యాల లో పాల్గొన్నసిటీ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల



**అక్షర విజేత ఖమ్మం:** 46 వ డివిజన్ లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సిటీ కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్,సోదరులు వెలిశాల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు వారి యొక్క స్వగృహంలో నిర్వహించిన ఉప్పలమ్మ తల్లి వేడుకలలో పాల్గొని అమ్మ వారి ఆశీర్వాదం తీసుకుని, అందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. సోదరుడు బైరి రాజేష్ ముద్దుల మేనల్లుడు లియాన్ష బారసాల వేడుకలలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించడం జరిగింది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మా అన్న 36వ డివిజన్ వాసి తోట రంగారావుని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు, 17వ డివిజన్లో మిత్రుడు కూరపాటి ఉదయ్ నివాసంలో ఉప్పలమ్మ తల్లి పండుగలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం తన చిన్ననాటి మిత్రుడు 48వ డివిజన్ నివాసి ఆవుల మహేష్ మాతృమూర్తి ఆవుల లక్ష్మమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

# పార్టీకి కాదు మనిషికి మద్దతు 28వ వార్డుకు ప్రజల మనిషి ఆలీ భాయ్ కావాలి



**అక్షర విజేత బెల్లంపల్లి :** బెల్లంపల్లి నియోజకవర్గం 28వ వార్డులో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిన బీఆర్ఎస్ నాయకుడు ఆలీ భాయ్ నజియా బేగం తమ కౌన్సిలర్?గా గెలవాలని స్థానికులు బలంగా కోరుకుంటున్నారు. ఆయన బీఆర్ఎస్ నాయకుడైనా, పార్టీ కోసమో రాజకీయ లాభాల కోసమో కాకుండా, మనిషి కోసం మనిషిగా చేసిన సేవలకే తాము మద్దతు ఇస్తున్నామని ప్రజలు ఈ సందర్భంగా తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరితో కలిసిమెలిసి పనిచేస్తూ, ఏ సమస్య చెప్పిన వెంటనే స్పందించి, అవసరమైతే తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి మరీ ప్రజలకు సహాయం చేసిన నాయకుడు ఆలీ భాయ్ అని వార్డు ప్రజలు అంటున్నారు. ఎలక్షన్ల సమయంలో మాత్రమే కనిపించే నాయకులు కాదు, ప్రతి రోజు ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరించే నాయకుడు కావాలని, అలాంటి వ్యక్తి ఆలీ భాయ్ మాత్రమేనని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రజల మనిషిగా నిలిచిన ఆలీ భాయ్ ఉంటేనే 28వ వార్డు నిజమైన అభివృద్ధి దిశగా ముందుకెళ్తుందనే నమ్మకం తమకుందని స్థానికులు వెల్లడిస్తున్నారు.

# మాసాయిపేట మండల కేంద్రంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవ భారీ ర్యాలీ





**అక్షర విజేత మాసాయిపేట :** మాసాయిపేట మండల కేంద్రంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని తాహసిల్దార్ జ్ఞాన జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నారులు గ్రామస్తులు అధికారులు అంగన్వాడి కార్యకర్తలు అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు. మాసాయిపేట మండల కేంద్రంలో వాడవాడలో తిరుగుతూ నినాదాలు ఇచ్చారు .ఇది మనకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అని నినాదాలతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ అనంతరం తాహసిల్దారు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు తర్వాత వృద్ధ ఓటర్ లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ జ్ఞాన జ్యోతి, గిర్దవారి హరీష్, మాసాయిపేట్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కృష్ణారెడ్డి , సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షుడు బొమ్మారం సర్పంచ్ రమేష్, చెట్ల తిమ్మాయపల్లి సర్పంచ్ అంశి మనోహర్, పోతనపల్లి సర్పంచ్ మాధవరెడ్డి, అచ్చంపేట హకింపేట సర్పంచులు మరియు ఉపసర్పంచులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉదండపురం నరసింహులు , మరియు గ్రామస్తులు సోషల్ విద్యార్థులు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డు విలీనం తప్పనిసరి

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**అక్షర విజేత, హైదరాబాద్ బ్యూరో:** సికింద్రాబాద్?లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేపట్టిన రిలే నిరాహార దీక్షల ఆరో రోజున ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్‌లో కచ్చితంగా విలీనం చేయాలని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ ప్రాంత ప్రజలు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారానికి ఈ ఉద్యమం కీలకమని, పార్టీలకతీతంగా అందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేపట్టిన దీక్షలు పూర్తిగా న్యాయబద్ధమైనవని పేర్కొంటూ, వాటిని అపహాస్యం చేసే వ్యాఖ్యలు సరికాదని విమర్శించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ రాజకీయ వ్యాఖ్యలకు పరిమితం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. కంటోన్మెంట్‌లో మౌలిక సదుపాయాల లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం నిరంతరం పోరాడుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ కృషిని అద్దంకి దయాకర్ అభినందించారు. అవసరమైతే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి పెద్ద ఎత్తున దీక్షలు చేపట్టి కంటోన్మెంట్ విలీనానికి మద్దతుగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు.

# రాష్ట్ర మున్నూరు కాపు సంఘం డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు!

## రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావు!!





**అక్షర విజేత, శివంపేట :** రాష్ట్ర మున్నూరు కాపు సంఘం డైరీ ఆవిష్కరణ మరియు సర్పంచుల సన్మాన కార్యక్రమానికి శివంపేట మండలంలోని ఎదులాపూర్ గ్రామ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను ఘనంగా శాల్వాతో కల్లూరి హనుమంతరావు సన్మానించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఉన్న వివిధ జిల్లాలో మండలాలలో గ్రామాలలో మున్నూరు కాపు సర్పంచులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అతిథులుగా మున్నూరుకాపు అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ పటేల్ ప్రధాన కార్యదర్శి, పెద్ది పెంటయ్య పటేల్ డైరీ ఆవిష్కరణ కమిటీ చైర్మన్, మంగళారపు లక్ష్మణ్ పటేల్, డైరీ ఆవిష్కరణ కమిటీ కో చైర్మన్ సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్రేపల్లి లో ఎంపీ నిధులతో బోరు బావి వేయించాం

గ్రామ ప్రజల నీటి సమస్య పరిష్కారం

ఎంపీ సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వెంకటరెడ్డిగ్ల ప్రవంతి శ్యామ్ రెడ్డి



**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్రేపల్లి (5వ వార్డు) లో ఎంపీ నిధులతో బోరు బావి వేసి మోటర్ బిగించామని 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వి ప్రవంతి శ్యామ్ రెడ్డి అన్నారు. శనివారం 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వి ప్రవంతి శ్యామ్ రెడ్డి అక్షర విజేత వికారాబాద్ ప్రతినిధితో మాట్లాడుతూ, బిజెపి పార్టీ కన్వీనర్ రాజేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్ సహకారంతో కొత్రేపల్లి గ్రామంలో ఎంపీ నిధులతో హనుమాన్ దేవాలయం దగ్గర బోరు బావి వేసి మోటార్ బిగించామని తెలిపారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కోసం బోర్ వేయించామని అన్నారు. భవిష్యత్తులో ఎంపీ సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బోరు బావి వేయించి మోటార్ బిగించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారని అన్నారు. భవిష్యత్తులో ఐదవ వార్డులో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి విజయలక్ష్మి, వి శ్యామ్ రెడ్డి, వి రామచంద్ర రెడ్డి, పి నర్సింలు, వి మల్లారెడ్డి, నర్సింలు, వీరారెడ్డి, ఎస్ పరమారెడ్డి, ఏ మల్లారెడ్డి, పి బాల్ రాజ్, జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బొమ్మనపల్లి సర్పంచ్ కొంకటి మౌనిక



**అక్షర విజేత:చిగురుమామిడి :** ప్రజాపాలనకు ఆకర్షితులై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యం లో చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామ సర్పంచ్ కొంకటి మౌనిక కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సర్పంచ్ కొంకట మౌనిక కి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,మాజీ జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చిటుమల్ల రవీందర్, దాసరి ప్రవీణ్ కుమార్ నేత,వార్డు సభ్యులు బడుకోలు దేవేందర్ రెడ్డి, నాయకులు బుర్ర శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం..





**అక్షరవిజేత మామడ:** మండలం లోని ఆయా గ్రామాల్లో పదహారవ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు. పద్దెనిమిది ఏళ్ళు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలపడం,ఓటు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం,స్వేచయుతమైన ఎన్నికల్లో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేయించడం,ర్యాలీ నిర్వహణ వంటి కార్యక్రమాలను అధికారులు చేపట్టారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగివుండాలని వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో పేకాట స్థావరంపై సిసిఎస్ దాడి



**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** నగరంలోని 4వ టౌన్ పరిధిలోని తిరుమల టాకీస్ ప్రాంతంలో పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ ఇంచార్జ్ మస్తాన్ ఆలీ సూచనల మేరకు సిఐ డి.సాయినాథ్, ఎస్సై గోవింద్ సిబ్బందితో కలిసి నగరంలోని తిరుమల టాకీస్ రోడ్డు దగ్గరలో ఉన్న ఒక గదిలో పేకాట స్థావరం పై దాడి నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు పేకాట రాయుళ్ళు ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,350నగదు, 4 సెల్ ఫోన్స్ లను స్వాధీనం చేసుకొని తదుపరి చర్య నిమిత్తం 4వ టౌన్ ఎస్ హెచ్ వోకి అప్పగించారు.

# ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి




మేరా యువభారత్ ఆధ్వర్యం లో ర్యాలీ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్



**అక్షర విజేత: కరీంనగర్ :** ప్రజాస్వామ్య దేశంలో సామాన్య పౌరుడి ఆయుధం ఓటుహక్కు అని ఎన్నికల వేళ ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్ అన్నారు.జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పాలకులను ఎన్నుకోవడంలో ప్రతి ఓటు ఎంతో కీలకమైందని అన్నారు. ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని, అప్పుడే ప్రజాస్వామ్యం మరింతగా పరిడవిల్లుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఉత్తమ సేవలు అందించిన ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు,టెక్నికల్ మేనేజర్లు, బీఎల్వోలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.యువ ఓటర్లకు గుర్తింపు కార్డులు అందించారు. పలువురు సీనియర్ సిటిజన్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు.



**ర్యాలీని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్**

జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలో మేరా యువభారత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియం నుంచి భగత్ సింగ్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఓటును మించి ఏది లేదు- నేను కచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో ర్యాలీ తీశారు. కరీంనగర్ క్రీడా పాఠశాల విద్యార్థులు, స్కౌట్, గైడ్స్ విద్యార్థులు, కలెక్టరేట్, రెవెన్యూ సిబ్బంది ఇతర శాఖల సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, డీవైఎస్ఓ శ్రీనివాస్, జిల్లా యువజన అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# యాదవులు రాజకీయ శక్తిగా ఎదగాలి



క్యాలెండర్ ఆవిష్కరణ సభలో మేకల మల్లి బాబు

యాదవ్ చిలకల వెంకట నరసయ్య



**అక్షర విజేత ఖమ్మం:** యాదవులు తమ సాంప్రదాయమైన గొర్రెల పెంపకం వృత్తి తో పాటు హక్కులు సాధించుకోవాలంటే రాజకీయ నిర్ణేత శక్తిగా ఎదగాలని అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, రాష్ట్ర నాయకులు లోడిగ వెంకన్న,దుబాకుల శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. చిత్తారు శ్రీహరి అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో యాదవ సంఘం నాయకులు ఆదివారం నాడు క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత సర్పంచ్ ఎన్నికలలో గణనీయంగా గెలిచినప్పటికీ, జనాభాపరంగా ఇంకా మెరుగైన స్థితిలో గెలవాల్సి ఉందని, రాబోయే స్థానిక మరియు మున్సిపల్ ఎన్నికలలో రాజకీయాలు వర్గాలకతీతంగా బీసీ ఎస్సీ ఎస్టీలు సహకారంతో యాదవులు ఐకమత్యంతో ప్రధాన పాత్ర వహించాలని పిలుపునిచ్చారు. యాదవ ప్రముఖులు మాట్లాడుతూ బీసీ వర్గాలలో యాదవులు సంఖ్యాపరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ, రాజకీయంగా ఎదగలేకపోతున్నామని, అందుకే గొర్రెల వృత్తి తో పాటు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, సూచించారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా యాదవులకు ప్రతి కుటుంబానికి రెండు లక్షల రూపాయలు రుణం మంజూరు చేయాలని, ఇతర కుల సంఘాల మాదిరిగా ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల సంఘం సభ్యులకు ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, పొదిల సతీష్ పొదిలి తిరుపతిరావు కనక బండి విజయలక్ష్మి రాగం కోటేశ్వరరావు, సత్తి వెంకన్న తోడేటి లింగరాజు, మురిమేకల కోటయ్య వాకదాని కోటేశ్వరరావు, చిత్తారు సిద్దు బొల్లి కొమరయ్య చల్ల వెంకటేష్, వాగదాని రాజు, రాగం బాబురావు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీకి మళ్లీ మహాత్ముడి పేరు పెట్టాల్సిందే



రాష్ట్రాలు, సర్పంచ్ హక్కులను కేంద్రం అరిస్తుంది

ఢిల్లీ చట్టాలు పేదల పొట్టకొడుతున్నాయి

మహేశ్వరం కాంగ్రెస్ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మన్సాన్ పల్లి చౌరస్తాలో భారీ నిరసన చేపట్టిన కాంగ్రెస్ నాయకులు





**అక్షర విజేత మహేశ్వరం :** జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి వీబీ జీరామ్ జీ పేరును పెట్టడంపై భారీ నిరసన చేపట్టారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. మన్సాన్ పల్లి చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేఎల్ఆర్ హాజరయ్యారు.ఈ సందర్భగా కిచ్చెన్న మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులన్నీ కేంద్రమే భరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పని కల్పించే బాధ్యతను గ్రామ సర్పంచ్ లకే అప్పగించాలని కోరారు.ప్రధాని మోడీ సర్కార్ ఢిల్లీలో కూర్చుని చట్టాలు మార్చి గ్రామీణ పేదల పొట్టకొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. క్రమంగా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తున్న విషయాన్ని ఇంటింటికీ తెలియజేయాలని లక్ష్మారెడ్డి కోరారు. గాంధీజీ పేరును మళ్లీ ఉపాధి హామీకి కొనసాగించాలని డిమాండ్ చేశారు.ప్రతీ పేదవాడికి పని కల్పించే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గారు జాతీయ ఉపాధి హామీ పథకం తెచ్చారని కే ఎల్ ఆర్ గుర్తు చేశారు. రాష్ట్రాల హక్కులు, సర్పంచుల అధికారాలను తగ్గించే కుయుక్తులకు బీజేపీ పాల్పడుతుందని కిచ్చెన్నగారు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# "అభివృద్ధి పేరుతో జన జీవన ఆధారమైన ప్రకృతి విధ్వం"



భూమి, అడవులు, నదులు, సముద్రాలు, గాలి, నీరు వంటి సహజ వనరులు ప్రజలందరికీ చెందాల్సినవి. కానీ అభివృద్ధి పేరుతో పెట్టుబడిదారీ వర్గం వీటిని నిర్దాక్షిణ్యంగా దోచుకుంటోంది. ఫలితంగా గ్రామాల్లోనూ, విస్తరిస్తున్న నగరాల్లోనూ భవిష్యత్ సామాజిక అవసరాలకు సరిపడా భూమి మిగలడం లేదు. ఉమ్మడి భూములు, ప్రజా స్థలాలు, సహజ వనరులు వ్యవస్థాగతంగా ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిపోతూ, సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. పేదలు, మధ్యతరగతి, అణగారిన వర్గాల వ్యక్తిగత ఆస్తులుగా ఉన్న చిన్న రైతు భూములు సరైన ప్రణాళిక లేకుండా ఉత్పాదకత లేని రంగాలుగా మారుతున్నాయి. భూమి ప్రైవేటీకరణ విస్తరిస్తున్న కొద్దీ, వ్యవసాయంపై ఆధారపడిన కోట్లాది ప్రజల జీవనాధారం తీవ్రంగా దెబ్బతింటోంది. భూమి పరాయీకరణ ప్రభావం ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీవ్రంగా పడింది. వ్యవసాయ ఉత్పాదకత తగ్గడం, జాతీయ ఆదాయంపై దాని ప్రభావం, పేదరికం పెరగడం, అసమానతలు తీవ్రమవడం, ఆహార కొరత పెరగడం ఇవన్నీ స్పష్టంగా కనిపిస్తున్న పరిణామాలు. దశాబ్దాలుగా వివిధ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ, ఖనిజాలు, ఇంధనం, భూ సేకరణ, వ్యవసాయం, పారిశ్రామికీకరణ, వాణిజ్యం వంటి అంశాల్లో ప్రజా ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలు అమలు చేయలేదు. ఈ విధానాలే లక్షలాది మందిని జీవన సంక్షోభంలోకి నెట్టుతున్నాయి. నూతన ఆర్థిక విధానాలు, పారిశ్రామిక విధానాలు, ప్రపంచీకరణ వ్యూహాల ద్వారా జాతీయ స్వయం సమృద్ధి అనే భావననే పాలక వర్గాలు ప్రశ్నించాయి. గాలిలో ఊగే దీపంలా, ప్రజల జీవితాలను ప్రపంచ మార్కెట్ సంక్షోభాలకు బానిసలుగా మార్చారు. వ్యవసాయ రంగాన్ని తప్పనిసరి సంక్షోభంలోకి నెట్టడం ద్వారా భూమి పరాయీకరణ మరింత తీవ్రమవుతోంది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను సామ్రాజ్యవాద శక్తులకు అప్పగించడం వల్ల కోట్లాది మందికి ఉపాధి భద్రత లేకుండా పోతోంది. భారత పాలక వర్గాలు దశాబ్దాలుగా సామ్రాజ్యవాదం, ఏకాధిపత్య పెట్టుబడిదారితనానికి అనుకూలంగా వ్యవహరించడమే ఈ సంక్షోభానికి మూలకారణం. వ్యవసాయం ఆధారిత ఎగుమతి పరిశ్రమల గురించి ప్రభుత్వం మాట్లాడుతున్నప్పటికీ, వాస్తవంలో అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాల విధానాలకు తలొగ్గి దిగుమతి సుంకాలను తీవ్రంగా తగ్గిస్తోంది. ఫలితంగా విదేశాల నుంచి భారీగా ఆహార పదార్థాలు, నూనెలు, పత్తి, ఇతర ముడి సరుకులు దేశంలోకి వస్తున్నాయి. దీని వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నా, ప్రభుత్వం కళ్లుమూసుకుంటోంది. వ్యవసాయ రంగం క్షీణిస్తున్నా, ఏకాధిపత్య కార్పొరేట్లకు లాభాలు వస్తున్నాయనే కారణంతో ఈ విధానాలు కొనసాగుతున్నాయి. ఒక వైపు దేశంలో నిరుద్యోగం పెరుగుతుండగా, మరో వైపు ఆహార దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. అయినా జీడీపీ గణాంకాలను వక్రీకరించి ప్రజలను మభ్యపెడుతున్నారు. ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పతనం, విదేశీ రుణాలపై చెల్లిస్తున్న వడ్డీలు, రాయల్టీ చెల్లింపులు విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఖాళీ చేస్తున్నాయి. దీని వల్ల ముడి సరుకులు, ఇంధనం దిగుమతుల్లోనూ బహుళజాతి సంస్థలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వ్యవసాయ రంగం కుప్పకూలడం వల్ల ఏర్పడిన ఉత్పాదకత సంక్షోభం రైతుల సంపదను అపారంగా నాశనం చేసింది. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు వ్యవసాయం పట్ల విసుగుపడుతున్నారు. సారవంతమైన, విలువైన భూములున్న ప్రాంతాల్లోనే భూమి పరాయీకరణ ఎక్కువగా జరగడం పెట్టుబడిదారీ వర్గాల అసలు లక్ష్యాన్ని బయటపెడుతోంది. ప్రభుత్వాల సహకారంతో కార్పొరేట్లు లక్షల ఎకరాల భూమిని ప్రైవేటు ఎస్టేట్లు, కార్పొరేట్ ఫార్ములు, ప్రైవేటు అడవులు, ప్రయివేటు జంతు సంరక్షణ కేంద్రాలు ("జూ" పార్క్ లు) గా మార్చుకుంటున్నారు. భూ సేకరణ చట్టాల పేరుతో రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటూ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఏజెంట్?లా పనిచేస్తోంది. దీనికి ఎదురు నిలిచిన రైతులను అణచివేస్తున్నారు. అయినా ఢిల్లీ నుంచి పంజాబ్ వరకూ, కర్ణాటకలోని దేవనహళ్లి వంటి ప్రాంతాల్లో రైతులు పోరాటాల ద్వారా కొన్ని విజయాలు సాధించారు. మార్కెట్ నుంచి నిల్వల వరకు మొత్తం సరఫరా వ్యవస్థను నియంత్రించే కార్పొరేట్ వ్యవసాయం వేగంగా విస్తరిస్తోంది. దీన్నే వ్యవసాయ సంక్షోభానికి ఏకైక పరిష్కారంగా చూపుతున్నారు. ఫలితంగా రైతులు తమ భూములను అమ్మడం లేదా లీజుకు ఇవ్వడం తప్ప మరో మార్గం లేకుండా పోతున్నారు. దీని వల్ల భవిష్యత్తులో తీవ్ర ఆహార సంక్షోభం, విదేశాలపై ఆధారపడే పరిస్థితి తప్పదని తెలిసినా పాలక వర్గాలు ఈ విధానాలను కొనసాగిస్తున్నాయి. పెట్టుబడిదారీ అభివృద్ధి, దాని సంక్షోభాలు, పేద దేశాల్లో జరుగుతున్న భూమి పరాయీకరణ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంది. ప్రతి పెట్టుబడిదారీ సంక్షోభ సమయంలో భూమిని మూలధనంగా మార్చే ప్రయత్నాలు వేగం పుంజుకుంటాయి. 'భూమి సాగు చేసేవారికే' వంటి నినాదాలను, భూ సంస్కరణల డిమాండ్లను పెట్టుబడిదారీ వర్గాలు తమ మేధావుల ద్వారా ఎగతాళి చేస్తున్నాయి.పరిశ్రమలు, భారీ నీటి ప్రాజెక్టులు, గనుల తవ్వకాల పేరుతో గ్రామాలు ఖాళీ చేయడం, అడవులు నాశనం చేయడం మనం చూశాం. కార్పొరేట్లకు అనుకూలంగా అడవులు, సారవంతమైన భూములు కబ్జా చేయడానికి పార్లమెంటులో చట్టాలు తీసుకొస్తున్నారు. ఇటీవలి కాలంలో సౌర విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో కూడా విలువైన వ్యవసాయ భూములు 'తిరస్కరించలేని పవర్ ఆఫ్ అటార్నీ' లీజుల ద్వారా కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. తక్కువ ధరలకు భూములు కొనడం లేదా లీజుకు తీసుకోవడం ద్వారా పెట్టుబడిదారీ శక్తులు రైతులను నష్టపరుస్తున్నాయి. ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం చెబుతున్నా, వాస్తవంగా ఉపాధి అవకాశాలు చాలా స్వల్పంగానే ఉంటున్నాయి చివరిగా...పెట్టుబడిదారీ అభివృద్ధి మోడల్?లో భూమి స్వాధీనం ఒక మౌలిక ప్రక్రియ. ప్రత్యేక ఆర్థిక మండలాల (ఎస్?ఈజెడ్?లు) పేరుతో లక్షల ఎకరాల భూమి రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీల నుంచి కార్పొరేట్లకు బదిలీ అవుతోంది. పర్యావరణ సంక్షోభాలకు కూడా భూమి పరాయీకరణనే పరిష్కారంగా చూపుతూ, సౌర ప్రాజెక్టులు, గనుల ప్రైవేటీకరణ ద్వారా కొత్త సంక్షోభాలను సృష్టిస్తున్నారు. చిన్న రైతుల్లో 86 శాతం మందిని వ్యవసాయం నుంచి తొలగించాలన్న లక్ష్యంతో మార్కెట్ మొత్తాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. ఒకవైపు ప్రజా బ్యాంకుల నుంచి కార్పొరేట్లు తీసుకున్న లక్షల కోట్ల రుణాలను రద్దు చేస్తూ, మరోవైపు వారికి రాయితీలు ఇస్తున్నారు. ఫలితంగా ప్రజల జీవన సంక్షోభం రోజు రోజుకూ తీవ్రమవుతోంది. డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.9849328496.

# శ్రీ మణికంఠ బ్యాటరీ షాపులో అగ్ని ప్రమాదం...నాలుగు లక్షల మేర ఆస్తి నష్టం.





**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి అక్షర విజేత, జనవరి 26:**-మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని భువనగిరి రోడ్డులో ఉన్న మణికంఠ బ్యాటరీ, ఎలక్ట్రికల్ వర్క్ షాపులో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బ్యాటరీలు, ఎలక్ట్రికల్ పరికరాలు ఉండే ఈ షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగసిపడ్డట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.షాపు యజమాని ఏనుగు లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, గత ఎనిమిదేళ్లుగా ఈ షాపును నిర్వహిస్తున్నారని, ఇలాంటి ఘటన మొదటిసారి ఎదురయ్యిందని తెలిపారు. ఆదివారం దుకాణం మూసి ఉండగా లోపలి నుంచి దట్టమైన పొగలు బయటకు రావడం గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై ఫైర్ డిపార్ట్?మెంట్?కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. బ్యాటరీలు కారణంగా మంటలు వేగంగా వ్యాపించే అవకాశం ఉండటం వల్ల ఫైర్ సిబ్బంది సుమారు అరగంట శ్రమించి షట్టర్లను ఓపెన్ చేసి, మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో షాపులో ఉన్న బ్యాటరీలు, వైర్లు, రిపేర్లకు సంబంధించిన పరికరాలు పూర్తిగా దగ్ధమై సుమారు నాలుగు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ అధికారులు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించి ఉండొచ్చని ఫైర్ అధికారులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయి కారణాలు వెలుగు చూడాల్సి ఉంది.ఈ ఘటనతో వాణిజ్య ప్రాంతంలో కొంతసేపు ఆందోళన నెలకొంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా షాపుల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



# అట్టహాసంగా శ్రీ సరస్వతి శిశు మందిర్ మెదక్ పూర్వ విద్యార్థుల- ఆచార్యుల ఆత్మీయ సమ్మేళనం







## చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్న ఆచార్యులు- విద్యార్థులు

**అక్షరవిజేత, పాపన్నపేట :** క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించిన విద్యా సంస్థలో వారందరు విద్యనభ్యసించారు.పాఠశాల ఆవిర్భవించిన నాటి నుంచి యాభై ఏళ్ళలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఒక చోట కలిశారు.గురువులను కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. గ్రూప్, సెల్ఫీ ఫోటోలు దిగి సందడి చేశారు. విద్యా బుద్ధులు నేర్పించిన ఆచార్యులను సన్మానించారు. సుదీర్ఘ విరామం అనంతరం స్నేహితులు కలవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మెదక్ లోని వినాయక కన్వెన్షన్ హాల్ వేదికైంది. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ 1971-2018 వరకు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యుల సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన శ్రీ సరస్వతి విద్యా పీఠం తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద విద్య శిక్షణ సంస్థ సరస్వతి శిశుమందిర్ అని, ఇందులో చదివిన విద్యార్థులు విలువలు, సంస్కారంతో పెరిగారన్నారు. ప్రతి మండలంలో శిశు మందిర్ పాఠశాల ఉండాలని, జిల్లా కేంద్రంలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు దీటుగా ఉండాలన్నారు. మాతృ భాష ద్వారా సంస్కృతి, ధర్మం రక్షించబడుతుందన్నారు. క్షేత్ర పూర్వ విద్యార్థి పరిషత్ సంయోజక్ హరిస్మరన్ రెడ్డి మాట్లాడుతూ యువతను జాగృతం చేసేందుకు, సనాతన ధర్మం వైపు తీసుకెళ్ళేందుకు 1952 లో గోరక్ పూర్ లో శిశు మందిర్ పాఠశాల ప్రారంభం అయిందన్నారు. ఒక కోటికి పైగా ఉన్న పూర్వ విద్యార్థులు అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్నారని అన్నారు. సీఐ మల్కాజి రాఘవేంద్ర మాట్లాడుతూ శిశు మందిర్ పాఠశాలలో చదవడం పూర్వ జన్మ సుకృతమన్నారు. పాఠశాలలో చిన్నప్పుడు ఖాకీ యూనిఫాం ధరించిన తనకు నిజ జీవతంలో భాగమైందన్నారు. సీఐ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ శిశు మందిర్ పాఠశాల చదువుతో పాటు విలువలు నేర్పాయన్నారు.అటవీ శాఖ రేంజ్ అధికారి విష్ణువర్ధన్ రావు మాట్లాడారు. పట్టణంలో నిర్మించే పాఠశాల నూతన భవన నిర్మాణనికి పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున విరాళాలు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల అలరించాయి. సమ్మేళనానికి వేయి మంది పూర్వ విద్యార్థులు, 150 మంది పూర్వ ఆచార్యులు హాజరయ్యారు.కార్యక్రమంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షులు గంజి శ్రీనివాస్, కార్యదర్శి దేవదత్తు, సహా కార్యదర్శి సుధాకర్, శిశు మందిర్ సమితి అధ్యక్షులు డా. భానుచందర్, సహా అధ్యక్షులు బండి వెంకటేశ్వర్లు, మెదక్ విభాగ్ కార్యవాహ నాగభూషణం, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి చైర్మెన్ రాజ్ కుమార్, పాఠశాల ప్రధానాచార్యులు ఆనంద్ రెడ్డి, విభాగ్ శైక్షనిక్ ప్రముఖ్ వెంకట్ రాంరెడ్డి, పాఠశాల బాధ్యులు మల్కాజీ సత్యనారాయణ, చోళ పవన్, నారాయణ, పిప్పిరి రవీందర్, సమ్మేళనం నిర్వాహకులు బండి నరేష్, రాఘవేందర్, శివ భార్గవ్, నవీన్, సంతోష్ కుమార్ , సుధాకర్, నాగరాజు, ప్రబంధకారిణి, సమితి సభ్యులు, పాఠశాల ఆచార్య బృందం పాల్గొన్నారు.

# మహేశ్వరంలో ఘనంగా కోట మైసమ్మ అమ్మవారి బోనాలు





**అక్షర విజేత మహేశ్వరం :** మహేశ్వరం మండల కేంద్రంలోని గడికోటలో కోట మైసమ్మ అమ్మవారికి ప్రతి సంవత్సరము శివరాత్రి ఒక నెల ముందు శివగంగ ఆలయం కమిటీ చైర్మన్ అల్లెకుమార్. గ్రామ పెద్దలు గ్రామస్తుల ఆధ్వర్యంలో కోట మైసమ్మకు బోనాలు అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగ శివగంగ రాజరాజేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయం నుండి గడికోట దగ్గరికి బోనాలు ర్యాలీగా వచ్చి బొడ్రాయి చుట్టూ తిరిగి కోట మైసమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామాన్ని చల్లగా చూడాలని అలాగే శివరాత్రి జాతర అంగరగా వైభవంగా జరగాలని అమ్మవారికి మొక్కుకున్నారు. చైర్మన్ అల్లెకుమారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఆనాటి నుండి ఈనాటి వరకు ఆనవాయితీగా అమ్మవారి బోనాలు నిర్వహిస్తాము బోనాలు నిర్వహించిన అనంతరం మహేశ్వరంలో ఉన్నటువంటి శ్రీ శివ గంగ రాజరాజేశ్వరి రాజేశ్వర స్వామి ఆలయం లో ఉన్నటువంటి శివరాత్రి జాతర సందర్భంగా ఆలయం ముస్తాబు పనులు నిర్వహించడం జరుగుతుంది. వివిధ గ్రామాల నుండి పట్టణాల నుండి మండలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు కనుక ఎవరికి ఏ ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేస్తామని చైర్మన్ అల్లే కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మురళీ. గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు. గ్రామస్తులు మహిళలు ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.



# అభివృద్ధి కి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ మాత్రమే

## నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల




**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** బిఆర్ ఎస్ హయం లో చేసిన అభివృద్ధి పనులు తప్ప ఒక్క ఇటుక కూడా ఈ రెండు సంవత్సరాల కాలంలో పెట్టలేదని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల విమర్శించారు. ఆదివారం నగరంలో పర్యటించిన నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఖలీల్ వాడిలో ప్రజల సౌకర్యర్థం నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేట్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బిగాల మాట్లాడుతూ రోజు రోజుకు నగరం విస్తరిస్తునందున ప్రజలకు స్వచమైన నిత్యావసరాలు అందుబాటులో ఉండే విధంగా చేపట్టిన మార్కెట్ పనులను మా బీఆర్ఎస్ హయాంలో సింహ భాగం పూర్తి చేసిన ఇప్పటి ఈ ప్రభుత్వం , ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతాలను అసాంఘిక కార్యకలాపకలకు అడ్డలుగా మారాయని విమర్శించారు.నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, ఎంపీ లు శంబుని గుడి వద్ద ఉన్న దుకాణాలను ఎందుకు తరలించటం లేదు.ఎప్పుడు ఎన్నికలు వచ్చిన గోడల మీద రాతలు రాయటం, శంబుని గుడి పక్కన ఉన్న దుకాణాలను తొలగించి వారికి ఈ మార్కెట్ లో షాప్స్ కేటాయించాలని ఆందోళనలు చేసి ప్రతి సారి అభివృద్ధికి అడ్డం పడ్డారని ఇప్పుడు మిరే ఆదికారంలో ఉన్న ఎందుకు దుకాణాలను తరలించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ నిర్మాణ పనులు పూర్తిగా జరిగిన ఎందుకు కేటాయిస్తాలేరని అన్నారు. అభివృద్ధి పనులు చేసే ఆలోచన లేకపోయినా కనీసం ఉన్న పనులను ఎందుకు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లు గా విజయం సాధిస్తేనే అభివృద్ధి సాధ్యమన్ని మాటలు చెప్పటం కాదు చేతల్లో చూపించిన చరిత్ర మాదని అన్నారు. మున్సిపల్ ఎన్నికలు సమిపిస్తున్నందున కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్నారని కానీ ఆ నిధులను తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీకి దక్కుతుందని 100 కోట్ల నిధులు మా బీఆర్ఎస్?ప్రభుత్వం హయాంలో మంజూరై ప్రతి డివిజన్ లో అభివృద్ధి పనులను ప్రారంభించామని గుర్తు చేస్తూ ఆ పనులకు సంబంధించిన జీవో?కాపీలను చూయించారు. నిజామాబాద్ నగరంలో గతంలో విద్యుత్ కాంతులతో నిండిన నగరం నేడు అంధకారం ఎందుకు అయ్యిందని, చేసిన అభివృద్ధిని పనులను కనీసం నిర్వహణ చేయలేని దౌర్భాగ్య పరిస్థితి లో ఈ ఎమ్మెల్యే ఉన్నారని ఏద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం హయాంలో శాంతి భద్రతలు క్షిణించాయని ఒక కానిస్టేబుల్ హత్య చేయబడ్డాడని, నిన్ననే ఒక మహిళ ఎక్సజ్ కానిస్టేబుల్ పై వాహనంతో తొక్కించారాని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, బీఆర్ఎస్?నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నూడా ఛైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యప్రకాష్, సుజిత్ ఠాకూర్, జగత్ రెడ్డి, నవీద్ ఇక్బాల్, ఇమ్రాన్ షహజాద్, అబ్దుల్ మతీన్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భావి భారత పౌరులను గంజాయి మహమ్మారి నుంచి కాపాడుకుందాం




**అక్షర విజేత అరకులోయ :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ గిరిజన సంఘం కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గం మొదటి సమావేశం ఆదివారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు గంజాయిని నిషేధించాలంటూ కరపత్రాన్ని విడుదల చేశారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గంజాయి మహమ్మారి నుంచి భావిభారత పౌరులను కాపాడుకోవాలని సూచించారు.గంజాయి ప్రభావం రోజురోజుకీ రాష్ట్రంలో పెరగడమే కాక ఆనందంగా గడుపుతున్న కుటుంబాల్లో కల్లోలాలు సృష్టిస్తుంది. ఎంతోమంది యువకుల జీవితాలలో చీకటి నింపుతుంది. కరోనా మహమ్మారి వారం రోజుల్లో మనుషుల ప్రాణాన్ని తీస్తే, గంజాయి మహమ్మారి చచ్చేదాకా నరకాన్ని చూపుతూ చంపుతుంది. తన మన అనే విచక్షణ లేకుండా సహనాన్ని కోల్పోయి సంఘ విద్రోహులుగా యువతను మార్చేస్తుంది. పాఠశాలలో కళాశాలలో చుట్టుప్రక్కల ప్రాంతాలను గంజాయి మాఫియా తమ అడ్డాగా మార్చుకుంటుంది తద్వారా చాలామంది విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కావున విద్యాసంస్థల పరిసరాలలో గంజాయి విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి గంజాయి సేవించచడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ అవగాహన క్యాంపులను నిర్వహించాలి. ఈ విధంగా గంజాయిని అరికట్టడంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. రఘునాథ్, వి మహేశ్వరరావు మరియు గౌరవ అధ్యక్షులు టీ చిట్టిబాబు మరియు జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

# శివంపేట మండల కేంద్రంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవ భారీ ర్యాలీ!

## తహసిల్దార్ కమలాద్రి చారి!!





**అక్షర విజేత, శివంపేట :** శివంపేట మండల కేంద్రంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని తాహసిల్దార్ కమలాద్రి చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలో వాడవాడలో తిరుగుతూ నినాదాలు ఇచ్చారు .ఇది మనకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అని నినాదాలతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ అనంతరం తాహసిల్దారు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షిపీయోద్దీన్, పోలీస్ సిబ్బంది, స్థానిక సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఇసు గారి మల్లేష్, మరియు రెవెన్యూ సిబ్బంది,అంగన్వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జగదాంబదేవి జాతర




**అక్షరవిజేత మామడ:** మండలంలోని పరిమండల్ గ్రామపంచాయతీ పరిధిలోని జగదాంబదేవితండాలో జాతర ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పరిమండల్ గ్రామపంచాయతీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎక్కడ చూసినా భక్తుల కోలాహలంతో జాతర కన్నుల పండువగా జరిగింది. గ్రామంలోని భక్తులతో పాటు దూరప్రాంతాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో హాజరై దర్శనం చేసుకున్నారు. చాలా మంది కుటుంబ సమేతరంగా జాతరకు తరలి వచ్చి ఆహ్లాదంగా గడిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా ఆటవస్తువులు, మిఠాయి దుకాణాలు వెలిశాయి.

# టేక్మాల్ లో ముగిసిన 198వ ఉర్సు ఉత్సవాలు



**అక్షరవిజేత,టేక్మాల్:** హజ్రత్ షాహీదల్లా ఖాద్రి 198 ఉర్సు ఉత్సవాలు ఈ రోజు ముగిసిన సందర్భంగా దర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ అహ్మద్ నూరుల్లహ ఖాద్రి ఉర్సు ఉత్సవాలలో పాల్గొన్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు. టేక్మాల్ గ్రామవాసులు,యువకులు, అధికారులనందరినకి ధన్యావాదాలు తెల్పారు, గ్రామ పౌరులు అందరు బాగుండాలని దేవుని తో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు యం ఏ సలీమ్ ఆధ్వర్యంలో దర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ అహ్మద్ నూరుల్లహ ఖాద్రి , పీఠాధిపతి గా బాధ్యత చేపట్టి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఘనంగా శాలువా పూలమాలతో సత్కరించారు. మెమెంటో అందజేశారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కార్పొరేటర్ అహ్మద్ సర్ఫరాజ్ సిద్ధికి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు ఎం ఏ ముక్తార్, మూర్తుజ తౌసిక్, ఎం ఏ సుభాన్, మహమ్మద్ షౌకత్, మహమ్మద్ ఇక్బాల్,కిఫాయత్ అలీ ,తహాఫుజ్ అలీ, ఖలీద్ ,తస్లీం,ఎం ఏ బాసిత్ నిజామి,ఎం ఏ అజీజ్, ఎం డి షాకీర్ , సలాఉద్దీన్,సయీద్ పటేల్, రెహమాన్, గౌస్, వసీం, రహ్మత్, దస్తగీర్, సయీద్, ఫిరోజ్,వసీం, హౌస్ (చిట్కి) హశం తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య వైద్య చికిత్సల కోసం రూ. 10 లక్షలు మంజూరు

## కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి




**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** విధి నిర్వహణలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులు కారుతో ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు వైద్య చికిత్సల కోసం ప్రభుత్వం రూ.10 లక్షలు తక్షణ సహాయం కింద మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కానిస్టేబుల్ సౌమ్య ప్రస్తుతం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆమెకు మరింత మెరుగైన వైద్య సేవల కోసం అవసరమైన తోడ్పాటును అందించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితి గురించి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ సమాచారం తెలుసుకుంటున్నారని, మెరుగైన వైద్యం అందించాల్సిందిగా నిమ్స్ ఆసుపత్రి వర్గాలను ఆదేశించారని అన్నారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని కలెక్టర్ భరోసా కల్పించారు.

# వైసిపి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

## వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి శ్యామల

## వైసిపి కార్యకర్తలను పరామర్శించిన శ్యామల





**అక్షర విజేత ఖమ్మం:** వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలకు అన్ని విధాలుగా వైసిపి పార్టీ అండ దండగా ఉంటుందని ఆ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ అధికార ప్రతినిధి సినీనటి అరె శ్యామల భరోసా ఇచ్చారు. వైసిపి కార్యకర్తలపై ఖమ్మంలో అక్రమ కేసులు బనాయించి అనేక ఇబ్బందులకు గురిచేసిన పార్టీ కార్యకర్తలను శ్యామల ఆదివారం వైయస్సార్ కాలనీలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. వైయస్సార్ కాలనీకి చెందిన ఎనిమిది మంది కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి పార్టీ మనుగడను దెబ్బతీయాలనుకోవడం వారి అవివేకం అన్నారు. వైఎస్ఆర్ ఆశీస్సులు, జగన్ మోహన్ రెడ్డి కి ఉన్న ప్రజాబలం ఉన్నంతకాలం ఏ శక్తులు అడ్డుకోలేవని అన్నారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో వైయస్సార్ కాలనీ ఏర్పాటు అయిందని అటువంటి కాలనీలు రెండు ఉమ్మడి రాష్ట్రాల్లో లక్షలాది మందికి కూడు గూడు నీడ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన మహనీయుడు అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి కి ప్రజా ఆశీస్సులు ఉన్నంతవరకు ఎన్ని కుట్రలు చేసిన వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని రానున్న కాలంలో జగనన్న ప్రభుత్వం రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అందరికీ మంచి జరుగుతుందని, ఎవరు కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదని కంటికి రెప్పలా ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. శ్యామలను చూసేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు పగిళ్ల నరేష్, శీలం భార్గవరెడ్డి, ఆలస్యం సుధాకర్, శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, నాగరాజు రెడ్డి, రవి, మురళి, శివారెడ్డి, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## జాతరలో తప్పిపోయిన బాలుడు...
## వెతికి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



**అక్షరవిజేత మామడ:** మండలం లోని పరిమండల్ జగదాంబ తండా జాతర సందర్భంగా తప్పిపోయిన రెండేళ్ల బాలుడు జాదవ్ రిషిని పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి వెతికి పట్టుకున్నారు. అనంతరం బాలుడిని అతని తండ్రి జాదవ్ లక్ష్మణ రావుకు సురక్షితంగా అప్పగించారు. జాతరలో జనసందోహం ఎక్కువగా ఉండటంతో బాలుడు దారి తప్పగా..సమాచారం అందుకున్న వెంటనే బందోబస్తు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డబ్ల్యు.పి.సి కళ్యాణి, మల్లీశ్వరిలు ప్రత్యేక చొరవ తీసుకుని బాలుడిని గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. బాలుడిని సురక్షితంగా అప్పగించినందుకు తల్లిదండ్రులు పోలీసుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

## రాజస్థాన్ శిక్షా సమితి
## అధ్యక్షులుగా వల్లబ్ సారడా నియామకం



**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** రాజస్థాన్ శిక్షా సమితి (హరిచరణ్ మార్వాడి స్కూలు) నూతన అధ్యక్షులుగా వల్లబ్ సారడాఎన్నికయ్యారు. శనివారం రాత్రి బస్టాండ్ ప్రక్కన గల హరిచరన్ మర్వాడి స్కూలులో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు హరిచరణ్ శిక్షా ట్రస్ట్ ఛైర్మెన్ ప్రేమాలతా అగర్వాల్ హాజరయ్యారు. నూతన కమిటీ సభ్యులచే ఆమె ప్రమాణ స్వీకారం చేయించాడు. ఈ సందర్భంగా ప్రేమలతా అగర్వాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి విద్య అందించాలని విద్యాభివృద్ధికి నూతన కమిటి పని చేయాలని ఇందుకు తన వంతు సహాకారాన్ని అందిస్తానని అన్నారు. రాజస్థాన్ శిక్షా సమితి కి మంచి పేరు ఉందని మరింతగా విద్యా వ్యాప్తికి నూతన కమిటీ పని చేయాలని కోరారు.భవిష్యతులో ఆధునిక నూతన శాస్త్రీయ విద్యా విధానాలను ప్రవేశపెట్టాలని సూచించారు. రాజస్థాన్ శిక్షా సమతి ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా తన పూర్తి సమయాన్ని కేటాయించి కృషి చేస్తానని నూతన అధ్యక్షులు వల్లభ్ సారడా హామి ఇచ్చారు. నూతన కమిటీ : రాభస్థాన్ శిక్షా సమితి నూతన కమిటి అధక్షులుగా వల్లభ్ సారడా, ఉపాధ్యక్షులు గా నరేష్ తివారీ, సెక్రటరీగా జితేందర్ మాలినీ,జాయింట్ సెక్రటరీ గా రాజేదపాండే, కోశాధికారి గా శ్రీకాంత్ జవర్ లతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.



## చిత్తారమ్మ అమ్మవారికి ప్రత్యేక
## పూజలు చేసిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**అక్షర విజేత, కుత్బుల్లాపూర్ :-** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని గాజుల రామారం డివిజన్?లో నిర్వహించిన చిత్తారమ్మ దేవి జాతర కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ జాతర కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై చిత్తారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ... చింతలను తీర్చే చిత్తారమ్మ తల్లి భక్తులందరినీ కరుణించి, సుఖసంతోషాలతో కాపాడాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా నిలవాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాచకొండ బాల్ రాజ్, నర్సింహులు, శంకర్ రెడ్డి, వంశీ గౌడ్?లతో పాటు కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 77వ గణతంత్ర దినోత్సవ
## కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.!

సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్ ముదిరాజ్!!



**అక్షర విజేత, శివంపేట :** శివంపేట గ్రామపంచాయతీ పరిధిలో జరిగే 77వ గణతంత్ర దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు, రైతులకు మహిళా సంఘం సభ్యులకు, యువకులకు పేరుపేరునా ఇదే ఆహ్వానంగా భావించి ఉదయం 8 గంటలకు జరిగే జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా స్థానిక సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

# మహేశ్వరంలో ఘనంగా కోట మైసమ్మ అమ్మవారి బోనాలు







**అక్షర విజేత మహేశ్వరం :** మహేశ్వరం మండల కేంద్రంలోని గడికోటలో కోట మైసమ్మ అమ్మవారికి ప్రతి సంవత్సరము శివరాత్రి ఒక నెల ముందు శివగంగ ఆలయం కమిటీ చైర్మన్ అల్లెకుమార్. గ్రామ పెద్దలు గ్రామస్తుల ఆధ్వర్యంలో కోట మైసమ్మకు బోనాలు అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగ శివగంగ రాజరాజేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయం నుండి గడికోట దగ్గరికి బోనాలు ర్యాలీగా వచ్చి బొడ్రాయి చుట్టూ తిరిగి కోట మైసమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామాన్ని చల్లగా చూడాలని అలాగే శివరాత్రి జాతర అంగరగా వైభవంగా జరగాలని అమ్మవారికి మొక్కుకున్నారు. చైర్మన్ అల్లెకుమారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఆనాటి నుండి ఈనాటి వరకు ఆనవాయితీగా అమ్మవారి బోనాలు నిర్వహిస్తాము బోనాలు నిర్వహించిన అనంతరం మహేశ్వరంలో ఉన్నటువంటి శ్రీ శివ గంగ రాజరాజేశ్వరి రాజేశ్వర స్వామి ఆలయం లో ఉన్నటువంటి శివరాత్రి జాతర సందర్భంగా ఆలయం ముస్తాబు పనులు నిర్వహించడం జరుగుతుంది. వివిధ గ్రామాల నుండి పట్టణాల నుండి మండలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు కనుక ఎవరికి ఏ ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేస్తామని చైర్మన్ అల్లే కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మురళీ కృష్ణ . గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు. గ్రామస్తులు మహిళలు ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.



# మున్సిపల్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి







### నిజామాబాద్ బల్దియా ఎన్నికల ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :** మున్సిపల్ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమని గత ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో మన పనితీరు ఆశించిన స్థాయిలో లేదని, ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఎన్నికల ఇంచార్జి ఉత్తమ్ కుమార్ రెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నిక సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని, ఎటువంటి ప్రలోభాలకు తావులేదని నిజామాబాద్ బల్దియా ఎన్నికల ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుందని , మరో రెండు మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ పథకాలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గేమ్ చేంజర్ గా మారాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 8.5 శాతం మంది ప్రజలకు లబ్ది చేకూరుతుందని ఇది ఓటర్ల తీర్పుపై సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో మూడేళ్ళ పాటు అత్యంత స్థిరంగా ఉంటుందని రాబోయే ఎన్నికల్లోనూ మళ్ళీ మనకే అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మన నిజామాబాద్ మన అభివృద్ధి అనే నినాదంతో ప్రజల్లోకి : పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో మన నిజామాబాద్ మన అభివృద్ధి అనే నినాదంతో తాము ప్రజల్లోకి వెళ్తున్నట్లు పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, నగర పాలక సంస్థపై కాంగ్రెస్ జండా ఎగువేయడమే లక్ష్యమని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర మంత్రి, నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తిగా సర్వేల ఆధారంగానే జరుగుతుందని స్పష్టం చేశారు. టికెట్ల కోసం ఎవరికి డబ్బులు ఇచ్చి ప్రలోభాలకు గురికావద్దని కార్యకర్తలకు సూచించారు. దేవుళ్ళ పేరుతో ఓట్లు అడిగే సంస్కృతి కాంగ్రెస్ పార్టీకి కాదని, కేవలం హిందూ పేరుతో ఎంపీ అయిన ధర్మపురి అరవింద్ నగర అభివృద్ధికి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. దేవుడిపేరుతో ఓట్లు అడిగే వారు అభివృద్ధిని విస్మరిస్తారని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజల మధ్య విషం నింపుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి బీజేపీ ఎంత దూరమో, మజ్లీస్ పార్టీ కూడా అంతే దూరమని ఆయనే కీలక వ్యక్తం చేశారు. కులం, మతం పేరిట ప్రజల జీవితాలను విచ్ఛిన్నం చేస్తానంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా ఉంటుంది : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజల్లో చెప్పుకొని సులువుగా గెలవచ్చని, అభ్యర్థుల ఎన్నిక సర్వే ప్రకారమే జరుగుతుంది టికెట్లు ఆశించేవారు వార్డులోనే ఉండి ప్రచారం చేసుకోవాలన్నారు.నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, గత పార్లమెంట్ ఎన్నికల ఉత్సాహాన్ని మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.?ప్రతి వార్డులో పార్టీ క్యాడర్ సమన్వయంతో పనిచేయాలని, గత పదేళ్లలో జరగని అభివృద్ధిని ఈ రెండు ఏళ్లల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలెక్కించిందని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మైనారిటీలు ,బడుగు బలహీన వర్గాల పక్షాన ఉంటుందని??మున్సిపల్ ఎన్నికల్లో వీరందరి మద్దతుతో మెజారిటీ స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు."ఐక్యతతోనే విజయం సాధ్యం : ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జిల్లాలోని నాయకులందరూ విభేదాలు పక్కన పెట్టి ఒకే తాటిపైకి రావాలని, మున్సిపల్ ఎన్నికలు మన ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రతి కార్యకర్త సోషల్ మీడియా ద్వారా, ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేస్తున్న పనులను వివరించాలన్నారు. నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, మైనింగ్ కార్పేరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, నగర అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ తదితరులున్నారు.



## గరిడపల్లి మండల సర్పంచుల ఫోరం
## అధ్యక్షునిగా గుండు రామాంజి గౌడ్ ఏకగ్రీవం

**అక్షర విజేత గరిడేపల్లి సూర్యపేట జిల్లా :** గరిడపల్లి మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశీస్సులతో, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సర్పంచులందరూ కలిసి నూతన కమిటీని ప్రకటించారు.

**నూతన కార్యవర్గ వివరాలు:**

మండల సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షులుగా, అధ్యక్షులుగా మరియు ఇతర బాధ్యులుగా ఈ క్రింది వారిని ఎన్నుకున్నారు:

అధ్యక్షుడు: గుండు రామాంజి గౌడ్
ఉపాధ్యక్షుడు: కటికం వేణు
ప్రధాన కార్యదర్శి: బానోత్ అరుణ రమేష్
కోశాధికారి: కుర్రి మహేష్
కార్యదర్శి: కాచవరపు నరసింహరావు

ముఖ్య అతిథుల సమక్షంలో..

ఈ ఎన్నిక కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రిపుర అంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైడిమర్రి రంగనాథ్, పెండెం సుజాత శ్రీనివాస్, కటికం ఆషా రమేష్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతామరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బల్దూరు సందీప్, ఆరే కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పరమేష్ మరియు మండలంలోని సర్పంచులందరూ పాల్గొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.



## ఉత్తమ విద్యావేత్త" పురస్కారం

### గడ్డిపల్లి ఆదర్శ పాఠశాల
### ప్రధానోపాధ్యాయురాలు డా. ప్రసన్న కుమారికి




**అక్షర విజేత గరిడేపల్లి :** విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గాను గడ్డిపల్లిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) ప్రధానోపాధ్యాయురాలు డా. జె. ప్రసన్న కుమారి ప్రతిష్టాత్మకమైన "బోధనా నైపుణ్య పురస్కారం -- ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు" దక్కించుకున్నారు. ప్రసిద్ధ అమేటీ విశ్వవిద్యాలయం వారు ఈ అవార్డును ప్రకటించారు.

**ఘనంగా పురస్కార ప్రదానం:**

విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులు డా. జె. రామచంద్రన్ చేతుల మీదుగా ఆమె ఈ గౌరవాన్ని అందుకున్నారు. విద్యార్థుల ప్రయోజనాలే పరమావధిగా సాగుతున్న విద్యా విధానాలు, నూతన బోధనా పద్ధతులు మరియు పాఠశాల నిర్వహణలో డా. ప్రసన్న కుమారి కనబరుస్తున్న అంకితభావాన్ని ఈ సందర్భంగా రామచంద్రన్ ప్రశంసించారు.

**పాఠశాల అభివృద్ధిలో అగ్రగామి:**

డా. ప్రసన్న కుమారి సమర్థవంతమైన నాయకత్వంలో గడ్డిపల్లి పాఠశాల విద్యా ఫలితాల్లోనే కాకుండా, పాఠ్యేతర అంశాలు మరియు క్రమశిక్షణలో విశేషమైన ప్రగతిని సాధించింది. ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ, విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేస్తూ సంస్థ విలువలను పెంపొందించడంలో ఆమె కృషి ఎంతో మరువలేనిది.

**అభినందనల జల్లు:**

తమ ప్రధానోపాధ్యాయురాలికి ఈ ఉన్నతమైన గుర్తింపు లభించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనత ద్వారా ఈ ప్రాంతానికి మరియు పాఠశాలకు గొప్ప గౌరవం చేకూరిందని వారు కొనియాడారు.

## మాజీ ఎమ్మెల్యేకు భద్రాచల
## ఆహ్వానం అందజేసిన రామకోటి రామరాజు

### భద్రాచల రామదాసు జయంతోత్సవాల ఆహ్వానం



**అక్షర విజేత గజ్వేల్ :** భద్రాచల రామదాసు జయంతోత్సవాల కార్యక్రమాల ప్రత్యేక శుభ ఆహ్వాన పత్రికను ఆదివారం రోజు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి అందజేశారు.భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్తి సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ భద్రాచల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరిగే భక్త రామదాసు ఉత్సవాల శుభ ఆహ్వాన పత్రికలను ఆదివారం రోజు రామకోటి రామరాజు ద్వారా అందుకోవడం అదృష్టంగా ఉందన్నారు. లక్షల మందిని ఆధ్యాత్మకం వైపు నడిపిస్తున్న రామకోటి రామరాజు ఆధ్యాత్మిక కృషి అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ ఖాన్, అశోక్ రెడ్డి, నంగునూరి సత్యనారాయణ, తలకొక్కుల ప్రేమ్ కుమార్, మున్నా, షాహెద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు

స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు



**అక్షర విజేత గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోయిని రాజు కుటుంబాన్ని ఆదివారం 2004 - 2005 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు పరామర్శించి 70 000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు, ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మా మిత్రుడు రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సందర్భంగా వారికి అండగా మిత్రులం వారికి ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని రాబోయే కాలంలో మా మిత్రులు అందరికి ఒకరికి ఒకరం అండగా ఉంటామని అన్నారు, ఇటీవల పూర్వ విద్యార్థుల సమావేశంలో మేమందరం కలిసి ఒక నిర్ణయానికి రావడం జరిగిందని అందరి కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు కాగా మిత్రునికి ఆపదలో సహాయం అందజేసిన పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు ఈ కార్యక్రమంలో పాతూరు మాజీ సర్పంచ్ అరుణ నర్సింలు,సీనియర్ నాయకులు తండా స్వామి,కుమ్మరి కరుణాకర్,అహ్మద్,రాజు,కనకయ్య,రవి,గచ్చుబాయి నగేష్ గౌడ్,నర్సింలు, ప్రభాకర్,కనకరాజు,పూర్వ విద్యార్థులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంచార్జి కలెక్టర్ కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు




**అక్షర విజేత, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ఓటర్ల నమోదు, ఓటరు అవగాహన కార్యక్రమాలు, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణలో విశేష కృషి చేసినందుకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందజేశారు. గరిమ అగ్రవాల్ గతంలో సిద్దిపేట జిల్లా దుబ్బాక శాసనసభ నియోజకవర్గానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఈఆర్ ఓ ఆర్వో గా పనిచేసిన సమయంలో, ఓటర్ల నమోదు, ఓటరు అవగాహన కార్యక్రమాలు, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. 16వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా మై ఇండియా. మై ఓట్ అనే థీమ్ తో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఆదివారం వేడుకలు నిర్వహించి, ఉత్తమ సేవలు అందించిన జిల్లా కలెక్టర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఈఆర్ఓ లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఈఓ సుదర్శన్ రెడ్డి నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు అందుకున్నారు. ఉత్తమ సేవలు అందించి అవార్డు పొందిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు జిల్లా అధికారులు, యంత్రాంగం శుభాకాంక్షలు తెలియజేశారు.

# పరకాల పట్టణంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం







**అక్షర విజేత: హన్మకొండ/ పరకాల :** ఆదివారం రోజు పరకాల పట్టణంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని గవర్నమెంట్ కళాశాలలో టి.విజయలక్ష్మి తహసిల్దార్ పరకాల అసిస్టెంట్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రెవెన్యూ డివిజన్ అధికారి డాక్టర్ కన్నం నారాయణ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి భారతీయ పౌరునికి ఓటు హక్కు కల్పించిందని అన్నారు. ఓటు హక్కు భారత ప్రజాస్వామ్యం సామాజిక అభివృద్ధిలో చాలా ప్రముఖ పాత్ర వహిస్తుందని అన్నారు. అనంతరం 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఎపిక్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్కువసార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ సూర్యప్రకాష్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ భద్రయ్య, ఎలక్షన్ ఆఫీసర్ రాంబాబు, ఆర్డిఓ ఆఫీస్ సిబ్బంది, తహసిల్దార్ ఆఫీస్ సిబ్బంది, బూత్ ఆఫీసర్స్ తో పాటు పరకాల పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# రథసప్తమి సందర్భంగా గురు పీఠంలో ప్రత్యేక పూజలు!



**అక్షర విజేత, శివంపేట :** శివంపేట మండల పరిధిలోని గూడూరు శ్రీ గురుపీఠంలో ఆదివారం రథసప్తమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పీఠంలోని శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతన సన్నిధిలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రథసప్తమి నాడు దత్తదేవుని ఆరాధన వల్ల ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రాప్తిస్తాయని భక్తుల నమ్మకం. ఈ కార్యక్రమంలో సాయిబాబ భక్తులు, మరియు దత్తాత్రేయ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేద్దాం







జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**అక్షర విజేత: హనుమకొండ /ఆత్మకూరు :** ఆదివారం ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.అంతకముందు జాతర పరిసర ప్రాంతాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర చైర్మన్ గా వంచ రంగారెడ్డి డైరెక్టర్లు, అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.... జాతర పాలకవర్గం అధికారులు సమన్వయంతో జాతరని విజయవంతం చేయాలని కోరారు.జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.భక్తుల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, విద్యుత్ వంటి అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు.జాతరను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా జాతర ప్రాధాన్యత పెంచేలా కృషి చేద్దామని, మనందరి బాధ్యత అని అన్నారు. పాలకవర్గ సభ్యులు సేవకుల పనిచేయాలని, ప్రతి ఒక్కరు టీం వర్క్ చేద్దామని అన్నారు.

# మైత్రి ఫౌండేషన్ తరుపున కుకునూరపల్లి పాఠశాల పదవ తరుగతి విద్యార్థులకు సాక్షి దినపత్రిక అందజేత

**అక్షర విజేత గజ్వేల్ :** సిద్ధిపేట జిల్లా కుకునూరపల్లి మండల కేంద్రంలో జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తులో జరగబోయే ఎగ్జామ్స్ కోసం సాక్షి దినపత్రికలో రోజు పదవ తరగతి విద్యార్థుల కోసం మోడల్ పేపర్లు సబ్జెక్టులకు సంబంధించిన వివరణ రోజు దినపత్రిక లో రావడం జరుగుతుంది. కావున ఈ విషయాన్ని గమనించిన పూర్వ విద్యార్థులు 2006 బ్యాచ్ విద్యార్థులు స్కూలు విద్యార్థులకు దినపత్రికను వచ్చేలాగా పది పేపర్లను డొనేట్ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మైత్రి ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులకి ఈ దినపత్రిక రాబోయే పరీక్షల్లో మోడల్ పేపర్స్ సబ్జెక్టు సంబంధించిన వాటిని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. అని భవిష్యత్తులో పదవ తరగతి తర్వాత భవిష్యత్తు నిర్ధారణ గురించి తెలియజేయడం జరిగింది అని రాబోయే ఎగ్జామ్స్ లో ప్రతి ఒక్కరు ఉత్తీర్ణులు అయి స్కూల్ యొక్క విలువలను పెంచాలని కోరారు. స్థానిక ఎన్నికల లో గెలిచినా రామునిపల్లి సర్పంచ్ శ్రీనివాస కుకునూరపల్లి వార్డ్ మెంబెర్ మహిపాల్, ముద్దాపూర్ వార్డ్ మెంబెర్ నాగరాజు, బొబయిపల్లి వార్డ్ మెంబెర్ నర్సింలు, మాతపల్లీ వార్డ్ మెంబెర్ స్వామీలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు రిప్పల స్వామి డాక్టర్ శివకుమార్,మలేష్ గౌడ్,బీ శ్రీనివాస్,టీ.మహేందర్, ఎల్,విక్రమ్, ఎమ్ మల్లేష్, కిషన్,జి కిరణ్ కుమార్ రెడ్డి, కుకునూరపల్లి ఎంఈవో బచ్చలి సత్తయ్య ల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పర్ధన్ సేవ సంఘం డివిజన్ స్థాయి ఎన్నిక





**అక్షర విజేత, బోథ్ ప్రతినిధి:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడా మండల కేంద్రంలో ప్రధాన్ సేవ సంఘం డివిజన్ ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. సంఘం అభివృద్ధి, గిరిజన హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలులో సంఘం కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథులుగా పర్ధన్ సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక సుదర్శన్, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహకుడు కొడప నగేష్ హాజరై మాట్లాడారు. సంఘం ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగితే సంఘానికి మరింత బలం చేకూరుతుందని తెలిపారు.డివిజన్ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా మాడవి గోవర్ధన్, అధ్యక్షుడిగా మండడీ నాగేశ్వర్, ఉపాధ్యక్షుడిగా కుర్సం సీతారాం, ప్రధాన కార్యదర్శిగా పూర్కా జంగుబాపు, సహాయ కార్యదర్శిగా మాడవి మారుతీ ఎన్నికయ్యారు. మహిళా విభాగాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో మహిళా ఉపాధ్యక్షులుగా మెస్రం భాగ్యలక్ష్మి, మాడవి అనసూయలను ఎంపిక చేశారు. అకౌంటెంట్?గా అర్క దేవిదష్, ప్రచార కార్యదర్శిగా తుంరామ్ శ్రీరామ్, సంయుక్త కార్యదర్శిగా సిడం ఉత్తమ్?లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పదాధికారులు మాట్లాడుతూ సంఘం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని, గ్రామస్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి వివిధ మండలాల నుండి ప్రధాన్ సేవ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారు.

# లయన్స్ క్లబ్ తాండూర్ ఆదర్శంకు అవార్డు పంట













## ఇండిగో రీజియన్ మిట్ చైర్మన్ మనోహర్ రెడ్డి చేతుల మీదగా

## 14 అవార్డు క్లబ్ అధ్యక్షులు శరణు బసప్పకు

**అక్షర విజేత, తాండూరు :** ప్రజాసేవలో తాండూర్ లైన్స్ క్లబ్ గుర్తింపు పొందుతూ అదే స్పూర్తితో తాండూరు లయన్స్ క్లబ్ ఆదర్శ కార్యక్రమాలతో తాండూరు లయన్స్ క్లబ్ ఎక్సెంట్ అనిపించుకుంది. పలు సామాజిక విస్తృతంగా సేవా కార్యక్రమాలతో తాండూరు లైన్స్ క్లబ్ ఉత్తమ సామాజిక సేవా కార్యక్రమంలో రీజియన్ మీట్ లో 14 ఎక్స్ లెంట్ అవార్డులను సొంతం చేసుకుంది. శనివారం షాద్ నగర్లో ఇండిగో రీజియన్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న తాండూరు లయన్స్ క్లబ్ కు ఎక్స్ లెంట్ అవార్డులను ప్రకటించారు. ఉత్తమ అధ్యక్షులుగా శరణు బసప్ప, ఉత్తమ కార్యదర్శిగా మంకాల నటరాజ్, కోశాధికారి గౌరీశంకర్ లకు ఎక్స్ లెంట్ అవార్డులను అందజేశారు. అదేవిధంగా తాండూరుకు ఉత్తమ లయన్స్ క్లబ్, ఉత్తమ హంగర్ ప్రోగ్రాం, వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, విద్యార్థలకు చేయూత తదితర విభాగాలలో ఎక్స్ లెంట్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణు బసప్ప, క్లబ్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అవార్డులు అందజేసిన ఇండిగో రీజియన్ మీట్ చైర్మన్ మనోహర్ రెడ్డికి, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తుప్రా ఖుర్దులో సీపీఎల్ 8వ సీజన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన



## గ్రామ సర్పంచి గొల్లూర్ రాజు

## సీఐ వెంకటేశ్వర్లు

**అక్షర విజేత మహేశ్వరం :** మహేశ్వరం మండల తుప్రా ఖుర్దు గ్రామంలో ఘనంగా సిపిల్ సిసన్-8 క్రికెట్ టోర్నమెంట్?ను నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామంలోని యువతకు క్రీడల ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా, వారిని డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచేలా ప్రోత్సహించే అవకాశంగా మారింది.ఈ టోర్నీలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు మరియు గ్రామ సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో ఈ టోర్నీ , ప్రధాన అతిథిగా హాజరై ఈ కార్యక్రమన్ని నిర్వహించారు.ఉపసర్పంచ్ రాజశేఖర్ , వార్డు సభ్యులు రమేష్, ఎం.శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీకాంత్, గ్రామ పెద్దలు ఎం.సతీష్, మల్లేష్, మురళి, ఎం.రమేష్,లు పాల్గొన్నారు. ఆర్గనైజర్లుగా రాఘవేందర్, సందీప్, రఘుపతి, మల్లేష్, పవన్, భరత్, విజయ్ తదితరులు కీలక పాత్ర పోషించారు. అలాగే అనేక మంది క్రీడాకారులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని టోర్నీని విజయవంతం చేశారు.సర్పంచ్ రాజు గొల్లూరి మాట్లాడుతూ, “క్రీడలు యువకుల్లో ఉత్సాహాన్ని, డిసిప్లిన్?ను పెంచుతాయి. డ్రగ్స్ వంటి చెడు అలవాట్లను పూర్తిగా నివారించాలి. ఇలాంటి కార్యక్రమాలు గ్రామ యువతను సానుకూల మార్గంలో నడిపిస్తాయి” అని అన్నారు. స్థానిక సీఐ వెంకటేశ్వర్లు కూడా డ్రగ్స్ నివారణపై హర్షం వ్యక్తం చేశారు. ఈ టోర్నీ గ్రామంలో క్రీడల సంస్కృతిని మరింత బలోపేతం చేస్తుందని ఆర్గనైజర్లు తెలిపారు.



## రంగ రంగ వైభవంగా శ్రీ రక్త మైసమ్మ దేవాలయ జాతర ఉత్సవాలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన పలు వ్యాపారులు నాయకులు





**అక్షర విజేత, తాండూరు :** తాండూరు పట్టణంలోని మర్రిచెట్టు కూడలిలో వెలిసిన శ్రీ రక్త మైసమ్మ దేవాలయ జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం గంజ్ మర్రిచెట్టు కూడలి లో వెలసిన శ్రీ రక్త మైసమ్మ దేవాలయ జాతర ఉత్సవాలు ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భక్తుల నిర్వహించారు. అలాగే జలాభిషేకం , అమ్మవారి పల్లకి సేవ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు ఈ ఉత్సవాలలో భక్తులు తమ మొక్కులను బోనాలు సమర్పించి తీర్చుకున్నారు. బోనాలు ,పల్లకి సేవ ముందు డప్పు వాయిద్యాల మధ్య సాంప్రదాయ, నృత్యాలు చేస్తూ భక్తి పాటలతో అమ్మవారి పల్లక సేవ నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులందరికీ అన్నదాన వితరణ చేశారు. ఈ జాతర ఉత్సవాలలో పట్టణానికి చెందిన పలువురు రాజకీయ నాయకులు ప్రముఖులు ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఆ బ్యాంక్ కస్టమర్లకు బిగ్ అలర్ట్..! 24, 25 తేదీల్లో ఈ టైమ్‌లో నిలిచిపోనున్న అన్ని సేవలు! కారణం, పూర్తి వివరాలు ఇవే!



ప్రస్తుతం డిజిటల్ బ్యాంకింగ్ సేవలు సులభతరం అయ్యాయి, ఫోన్‌లోనే చాలా పనులు జరుగుతున్నాయి. అయితే, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తన ముఖ్యమైన సిస్టమ్ మెయింటెనెన్స్ కారణంగా జనవరి 24 (శనివారం), జనవరి 25 (ఆదివారం) అర్ధరాత్రి 12 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు తన డిజిటల్ సేవలను నిలిపివేయనుంది. ప్రస్తుతం బ్యాంకింగ్ సేవలు చాలా సులభం అయిపోయాయి. బ్యాంక్‌కు వెళ్లాల్సిన అసవరం లేకుండానే అనేక సర్వీస్‌లు మన ఫోన్‌లోనే పూర్తి అయిపోతున్నాయి. డిజిటల్ విప్లవంలో భాగంగా అన్ని బ్యాంకులు కూడా తమ కస్టమర్లకు డిజిటల్ సేవలు అందిస్తున్నాయి. దాదాపు ప్రతి ఒక్క బ్యాంక్ కస్టమర్ డిజిటల్ సేవలకు అలవాటు పడిపోయారు. ఒక్క గంట సేపు ఆ సేవలు నిలిచిపోయినా కూడా కంగారు పడిపోతారు. అందుకే బ్యాంకులు తమ సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్త తీసుకుంటాయి. ఏదైనా సిస్టమ్ అప్డేట్స్ ఉంటే ముందుగానే కస్టమర్లకు తెలియజేస్తున్నాయి. తాజాగా ప్రముఖ ప్రైవేటు బ్యాంకు హెడ్‌డీఎఫ్‌సీ కూడా తన ఎసెన్షియల్ సిస్టమ్ మెంయిటెనెన్స్‌లో భాగంగా తమ అన్ని రకాల సేవల్లో అంతరాయం ఏర్పడనుందని ముందుగానే తెలియజేసింది. శనివారం (24 జనవరి 2026) అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 4 గంటల మధ్య సేవలు నిలిచిపోతాయని, అలాగే ఆదివారం (25 జనవరి 2026) కూడా అర్ధరాత్రి 12 గంటల నుంచి 4 గంటల మధ్య ఈ మెయింటెనెన్స్ కారణంగా అన్ని రకాల సర్వీస్‌లు హెడ్‌డీఎఫ్‌సీ నెట్ బ్యాంకింగ్, పే జ్యాప్, మై కార్డ్స్, వాట్సాప్ చాట్ బ్యాంకింగ్ సేవలు నిలిచిపోతాయని హెచ్‌డీఎఫ్‌సీ అధికారికంగా ఒక ప్రకటనలో తెలిపింది.

## బడ్జెట్ తర్వాత బంగారం ధరలు తగ్గుతాయా.. అసలు నిజాలు ఏంటంటే..




పసిడి ధరలు సామాన్యుడికి బంగారు కలగా మారుతున్నాయి. ఇప్పుడు రూ.1.6 లక్షల మార్కును తాకడం పేద ప్రజలకు కోలుకోలేని దెబ్బగా మారింది. పెళ్లిళ్ల సీజన్ ముంచుకొస్తున్న వేళ, అంతర్జాతీయ మార్కెట్ సెగలు పసిడిని ఆకాశానికి ఎత్తేస్తున్నాయి. ఈ క్రమంలో అందరి చూపు ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్ 2026 వైపు మళ్లింది. సామాన్యుడికి ఇప్పుడు బంగారం కొనడం ఒక కలగా మారిపోయింది. అంతర్జాతీయ పరిణామాలు, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం ధరలు మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1.6 లక్షల మార్కును తాకడంతో పేద ప్రజలు వివాహాలు, పండుగలకు నగలు కొనాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే అందరి దృష్టి కేంద్ర బడ్జెట్‌పై పడింది.

**ధరలు పెరగడానికి ప్రధాన కారణాలేంటి**

నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరత పసిడి ధరలను ప్రభావితం చేస్తోంది. గ్లోబల్ మార్కెట్?లో బంగారం ధర రికార్డు స్థాయిలో 5,000 డాలర్లకు, వెండి 100డాలర్లకి చేరువలో ఉండటం ప్రధాన కారణం. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతి ఖర్చులు భారమయ్యాయి. గ్రీన్?ల్యాండ్ వివాదం వంటి అంతర్జాతీయ ఘర్షణలు సరఫరా గొలుసును దెబ్బతీసి, మార్కెట్?లో ఆందోళనను పెంచాయి.

**ఆభరణాల పరిశ్రమ డిమాండ్లు ఇవే..**

పెరుగుతున్న ద్రవ్యోల్బణం దృష్ట్యా, ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కొన్ని కీలక ఉపశమన చర్యలు చేపట్టాలని 'ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్, ఇతర ప్రముఖులు విజ్ఞప్తి చేస్తున్నారు. బంగారంపై దిగుమతి సుంకాన్ని హేతుబద్ధీకరించడం వల్ల దేశీయంగా ధరలు తగ్గుతాయని, తద్వారా సామాన్యులకు ఊరట లభిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆభరణాలపై ఉన్న 3శాతం +టూని 1.25శాతం లేదా 1.5శాతానికి తగ్గించాలని డిమాండ్ ఉంది. ఇది జరిగితే మధ్యతరగతి, గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది.

## భగ్గుమంటున్న బంగారంఏకంగా రెండు లక్షలకు చేరువగా పరుగులు..! ఈ రోజు ధరలు ఎలా ఉన్నాయంటే..




బాబోయ్ బంగారం, వెండి ధరలు భగ్గుమంటున్నాయి. పసిడి పరుగులు సామాన్యులకు చెమటలు పట్టిస్తోంది. ఇక పేద మధ్య తరగతి ప్రజలు బంగారాన్ని మ్యూజియంలో చూసుకోవాల్సి వస్తోందేమోననే భయం కలిగిస్తోంది. పేదింట్లో ఆడపిల్ల పెళ్లి చేయాలంటే.. తులం బంగారం కొనాలన్నా సుమారు రెండు లక్షలు పెట్టాల్సిన దారుణమైన పరిస్థితి వచ్చేసింది. గోల్డ్? స్పీడ్?కు ధాటికిగా సిల్వర్? కూడా చుక్కలు చూపిస్తోంది. నేనేం తక్కువ కాదు అన్నట్టుగా ఏకంగా మూడు లక్షలు దాటేసింది..బంగారం, వెండి కొనాలని చూస్తున్న వారికి ఇది అస్సలు మంచి టైమ్? కాదని చెప్పాలి.. ఇవాళ్టి బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూస్తే.. సరఫరాలో అంతరాయాలు, డిమాండ్?లో మార్పులు, కరెన్సీ కదలికలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి ప్రపంచ కారకాల కారణంగా భారతదేశంలో బంగారం ధరలు రోజువారీగా హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. జనవరి 24 శనివారం నాటికి భారతదేశంలో బంగారం ధర 10 గ్రాముల ప్రాతిపదికన లెక్కించినప్పుడు, భారతదేశంలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.1,57,160లు చేరింది. అదే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.1,44,060లు పలుకుతోంది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.1,17,870లుగా ఉంది. శనివారం ఉదయం 8గంటల లోపు దేశంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ చూద్దాం..

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,58,740 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,45,510 గా ఉంది. వెండి కిలో ధర రూ.3,45,100

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,57,160, 22 క్యారెట్ల ధర రూ.1,44,060 గా ఉంది. వెండి కిలో ధర రూ.3,40,100గా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,57,310 క్యారెట్ల ధర రూ.1,44,210 గా ఉంది. వెండి కిలో ధర రూ.3,40,100గా ఉంది.

కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,57,160, 22 క్యారెట్ల ధర రూ.1,44,060 గా ఉంది.వెండి కిలో ధర రూ.3,40,100గా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,57,160, 22 క్యారెట్ల ధర రూ.1,44,060 గా ఉంది. వెండి కిలో ధర రూ.3,40,100గా ఉంది.

హైదరాబాద్?లో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,57,160, 22 క్యారెట్ల ధర రూ.1,44,060 గా ఉంది. వెండి కిలో ధర రూ.3,60,100గా ఉంది.

విజయవాడలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,57,160, 22 క్యారెట్ల ధర రూ.1,44,060 గా ఉంది. వెండి కిలో ధర రూ.3,60,100గా ఉంది.

విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,57,160, 22 క్యారెట్ల ధర రూ.1,44,060 గా ఉంది. వెండి కిలో ధర రూ.3,60,100గా ఉంది.

ఇక్కడ పేర్కొన్న బంగారం ధరలు ఉదయం 8 గంటలలోపు అందిన సమాచారం మేరకు మాత్రమే. ధరలు ప్రతి క్షణం మారవచ్చు. అందువల్ల బంగారం కొనుగోలుదారులు ఇచ్చిన సమయంలో ప్రత్యక్ష ధరలను ట్రాక్ చేయాలి. ఇక్కడ పేర్కొన్న ధరలు నిన్నటి ముగింపు ధరలు అయితే నేటి ధర తగ్గుదలతో లేదా పెరుగుదలతో ప్రారంభమవుతుంది. అలాగే, అన్ని నగరాల్లో ఈ ధరలు ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్?డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్?కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

## బీపీ వచ్చినట్లు వణికిపోతున్న రూపీ..

# పతనం అవుతున్న రూపాయి విలువ



బీపీ వచ్చినట్లు రూపీ వణికిపోతోంది. రూపాయి మారకం విలువ ఆల్? టైమ్? కనిష్ట స్థాయికి చేరడంతో అలారం బెల్స్? మోగుతున్నాయి. రూపాయి పతనం.. ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపనుంది? కామన్?మేన్? జేబుకు భారీ చిల్లు పడనుందా? ఈ పతనం ఇంకా ఎంతదాకా వెళ్లే అవకాశం ఉంది. మన రూపాయి విలువ రోజురోజుకూ క్షీణిస్తోంది. అమెరికన్ డాలర్?తో పోలిస్తే 77 పైసలు క్షీణించి 91.74 దగ్గర ఆల్?టైమ్ కనిష్ట స్థాయిని నమోదు చేసింది. చివరకు 68 పైసలు నష్టపోయి 91.65 దగ్గర స్థిరపడింది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు తెచ్చిపెట్టేలా ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రూపాయి పతనంతో ఖర్చులు పెరిగి, రుణాలు మరింత ఖరీదెక్కి, దిగుమతులు భారమై ధరలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలిసారిగా రూపాయి ఈ స్థాయిలో పతనం అవడం, ఆర్థిక వర్గాల్లో అలారం బెల్స్? మోగిస్తోంది. రూపాయి విలువ గత 11 ఏళ్లలో 57 శాతం డౌన్? అయింది. ఈ ఏడాదిలో రూపాయి విలువ రూ. 1.77 మేర పతనమైందని, దీంతో ఆసియాలోనే అత్యంత బలహీన కరెన్సీల్లో రెండోదిగా రూపాయి నిలిచిందని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

**ఓవైపు ట్రంప్ సుంకాల ఎఫెక్ట్**

గ్రీన్ ల్యాండ్ గొడవలోసుంకాల పేరిట అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. యూరోపియన్ యూనియన్ దేశాలపై బెదిరింపులకు దిగడం, తమ దేశంలోకి దిగుమతయ్యే భారతీయ వస్తువులు, సర్వీసులపై ట్రంప్ పెద్ద ఎత్తున సుంకాలు విధించడం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక-రాజకీయ అనిశ్చితుల కారణంగా దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం లాంటి కారణాలతో ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలువ అంతకంతకూ బలహీనపడుతున్నట్టు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. స్టాక్? మార్కెట్ నుంచి విదేశీ నిధుల నిరంతర నిష్క్రమణ, అలాగే బంగారం, వెండి లాంటి మెటల్స్ దిగుమతిదారుల నుంచి డాలర్?కు విపరీతమైన డిమాండ్? పెరగడంతో రూపాయి విలువ క్షీణిస్తోంది.

**రూపాయి పతనంతో పెను ప్రమాదం**

రూపాయి విలువ అంతకంతకు పతనమైతే, అది పెను ప్రమాదం తెచ్చి పెడుతుందని, అనేక సవాళ్లు ఎదురవుతాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో దేశీయంగా ద్రవ్యోల్బణం కట్టలు తెంచుకునే ప్రమాదం ఉందని చెప్తున్నారు. అలాగే దేశంలోకి దిగుమతయ్యే ప్రతి వస్తువు ధర పెరుగుతూపోతుంది. చెల్లింపులు డాలర్లలో జరగడమే దీనికి కారణమంటున్నారు. ముఖ్యంగా ముడిచమురుతో పాటు మొబైల్స్, కంప్యూటర్లు వంటి దిగుమతి చేసుకొనే కన్జ్యూమర్ గూడ్స్ ధరలు పెరగొచ్చని చెప్తున్నారు. అలాగే, ప్రజల కొనుగోలు శక్తి సన్నగిల్లి, తయారీ రంగం కుంటుబడుతుందని అంచనా వేస్తున్నారు. తద్వారా నిరుద్యోగం విజృంభించి చివరకు వృద్ధిరేటు క్షీణించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అన్ని ఖర్చులు పెరిగి కామన్?మేన్? జేబుకు చిల్లు పడే అవకాశం ఉంది. రుణాలు మరింత ఖరీదెక్కే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి మార్కెట్లో అస్థిరతను తగ్గించేందుకు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అప్పుడప్పుడు జోక్యం చేసుకుంటున్నప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులు చక్కబడే వరకు రూపాయిపై ఒత్తిడి ఇలాగే కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇంట్లో వేరే దేశపు కరెన్సీ పెట్టుకోవచ్చా..

## రూల్ ప్రకారం ఫారెన్ కరెన్సీ ఇంట్లో ఎంత ఉండొచ్చు



మీరు ఇంట్లో విదేశీ కరెన్సీని ఉంచుకోవచా ఖీజుహీూ చట్టం ప్రకారం, భారత పౌరులు తమ ఇంట్లో 2,000 డాలర్ల (లేదా సమానమైన) విదేశీ కరెన్సీని ఎటువంటి కాలపరిమితి లేకుండా నిల్వ చేయవచ్చు. దీనికి మించితే 180 రోజుల్లోపు బ్యాంక్‌లో జమ చేయాలి. మన దేశం నుంచి చాలా మంది విదేశాలకు వెళ్తుంటారు. అక్కడ జాబ్, ఎడ్యుకేషన్, బిజినెస్?, టూర్ పలు కారణాలతో కొంత కాలం ఉండి తిరిగి ఇండియాకు వస్తారు. అలా వచ్చే క్రమంలో అక్కడి కరెన్సీ కొంత తెచ్చుకుంటారు కూడా. అయితే కొంతమంది నిత్యం విదేశాలకు ప్రయాణించే వారు కూడా విదేశీ కరెన్సీని తమతో ఉంచుకుంటారు. అయితే అసలు ఇండియాలోని మన ఇంట్లో విదేశీ కరెన్సీ ఉంచుకోవచ్చా? ఒక వేళ ఉంచుకోవచ్చు అంటే రూల్స్ ప్రకారం ఎంత మొత్తం నిల్వ ఉంచుకోవచ్చు అనేది ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. 2021 సెప్టెంబర్ 29న ఆదాయపు పన్ను శాఖ ప్రశాంత్ అనే వ్యక్తి ఇంటిపై దాడి చేసింది. ఈ దాడిలో అతని ఇంట్లో విదేశీ కరెన్సీ (ఫారెక్స్), బంగారం, ఇతర ఆస్తులను అధికారులు గుర్తించారు. ఆ తర్వాత ఆదాయపు పన్ను శాఖ నోటీసు జారీ చేసి, దాదాపు రూ.5.6 లక్షల విలువైన విదేశీ కరెన్సీతో సహా అతని ఆస్తులను స్వాధీనం చేసుకుంది. ప్రశాంత్ మొదట (ఆదాయపు పన్ను కమిషనర్ -- అప్పీళ్ల)కి అప్పీల్ చేసుకున్నాడు. ఈ స్వాధీనం అన్యాయమని ఆరోపించాడు. ఈ నిర్ణయం అతనికి అనుకూలంగా వచ్చింది. ఆ తర్వాత ఆదాయపు పన్ను శాఖ ఈ కేసును ముంబైలోని (ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్)కి తీసుకెళ్లింది, కానీ ప్రశాంత్ 2025 అక్టోబర్ 28న అక్కడ కూడా గెలిచాడు. న్యాయవాదులు నిషిత్ గాంధీ. అద్వ్య భండారి ప్రశాంత్ తరపున వాదించారు. తన వద్ద దొరికిన విదేశీ కరెన్సీని తాను, తన కుటుంబం వివిధ విదేశీ పర్యటనల సమయంలో చట్టబద్ధంగా కొనుగోలు చేశారని ప్రశాంత్ వివరించారు. బ్యాంక్ స్టేట్?మెంట్?లు, అధీకృత ఫారెక్స్ డీలర్ల నుండి కొనుగోలు రసీదులు, విదేశీ ప్రయాణానికి పాస్?పోర్ట్ ఎంట్రీలు, విదేశీ ఖర్చుల రికార్డులు వంటి పత్రాలను ఆయన సమర్పించారు. తన కుమార్తె విదేశాల్లో చదువుతోందని, తన భార్య కూడా విదేశాలకు వెళ్లిందని, కాబట్టి ఇంట్లో కొంత విదేశీ కరెన్సీ ఉండటం సహజమని కూడా ఆయన వివరించారు.

**ఏం చెప్పింది**

విదేశీ కరెన్సీ కొనుగోళ్ల మూలం సరిగ్గా స్థాపించబడితే, స్వదేశంలో విదేశీ కరెన్సీని కనుగొన్నంత మాత్రాన అది చట్టవిరుద్ధం కాదు. విదేశాల నుండి తిరిగి వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరూ ప్రతి డాలర్ లేదా యూరోను మార్పిడి చేసుకోవాలని ఆశించడం ఆచరణాత్మకం కాదని కూడా ట్రిబ్యునల్ పేర్కొంది. చట్టం ప్రకారం ఇంట్లో ఎంత విదేశీ కరెన్సీని ఉంచుకోవచ్చు ఖీజుహీూ చట్టం ప్రకారం ఒక భారతీయ పౌరుడు ఎటువంటి కాలపరిమితి లేకుండా ఇంట్లో 2,000 అమెరికన్? డాలర్లు (లేదా సమానమైన విదేశీ కరెన్సీ) వరకు ఉంచుకోవచ్చు. విదేశీ నాణేలను కలిగి ఉండటంపై ఎటువంటి పరిమితి లేదు. విదేశీ కరెన్సీ 2,000 డాలర్లు దాటితే, దానిని 180 రోజుల్లోపు అధీకృత బ్యాంక్/డీలర్ వద్ద జమ చేయాలి లేదా =ఖీజ ఖాతాలో జమ చేయాలి. అలా చేయడంలో విఫలమైతే ఖీజుహీూ కింద జరిమానా విధించబడుతుంది.

# 68 ఏళ్ల వయసులోనూ 'బోర్డర్ 2' హీరో పవర్‌ఫుల్ ఫిట్ నెస్! అసలు సీక్రెట్ ఇదే



ఆయన వెండితెరపై డైలాగ్ చెబితే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు రావాల్సిందే.. ఆయన గంభీరమైన వాయిస్ వింటే శత్రువుల గుండెల్లో వణుకు పుట్టాల్సిందే. ఒకప్పుడు 'బోర్డర్' సినిమాలో దేశభక్తిని రగిలించి, దశాబ్దాల తర్వాత 'గదర్ 2' తో ఇండియన్ సినిమా రికార్డులను తిరగరాసిన స్టార్ ఆయన.ఆ మాస్ హీరోకు ఇప్పుడు 68 ఏళ్లు. కానీ ఆయన లుక్స్ చూస్తే మాత్రం 30 ఏళ్ల యువకుడిలా కనిపిస్తారు. వయస్సు కేవలం అంకె మాత్రమే అని నిరూపిస్తూ, నేటి తరం కుర్ర హీరోలకు కూడా సాధ్యం కాని ఫిట్?నెస్?తో ఆయన అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. అసలు ఈ వయసులో కూడా ఆయన అంత యాక్టివ్?గా ఉండటానికి కారణం ఏంటి? ఆయన రోజువారీ దినచర్యలో పాటిస్తున్న ఆ కఠినమైన సూత్రాలేంటి? 'బోర్డర్ 2' తో రికార్డులను తిరగరాస్తున్న సన్నీ డియోల్? ఫిట్?నెస్ సీక్రెట్స్ ఏంటో తెలుసుకుందాం.

**పక్కా ప్లానింగ్..**

సన్నీ డియోల్ తన ఫిట్?నెస్?కు ప్రధాన కారణం వ్యాయామంతో పాటు తీసుకునే ఆరోగ్యకరమైన ఆహారం అని చెబుతారు. ఫుడ్ విషయంలో ఆయన చాలా స్ట్రిక్ట్ డైట్ ఫాలో అవుతారు. ముఖ్యంగా ఈ హీరో నాన్-వెజ్ ఆహారానికి పూర్తిగా దూరంగా ఉంటారు. బయట దొరికే జంక్ ఫుడ్ జోలికి అస్సలు వెళ్లరు. తన డైట్?లో రోజూ యోగర్ట్, యాపిల్స్ ఉండేలా చూసుకుంటారు. పంజాబీ మూలాలు ఉన్న ఆయనకు లస్సీ, వెన్న అంటే చాలా ఇష్టమట. ముఖ్యంగా ఇంట్లో తయారుచేసిన మెంతి పరోటాలను ఆయన ఎంతో ఇష్టంగా తింటానని పలు సందర్భాల్లో వెల్లడించారు.

**వ్యాయామం -- ఒక వ్యసనం..**

సన్నీ డియోల్ ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఒకటి లేదా రెండు గంటలు కఠినమైన వ్యాయామం చేస్తారు. వర్కౌట్స్ చేయడం తనకు ఒక వ్యసనం లాంటిదని ఆయన చెబుతారు. "ఒక్క రోజు జిమ్ మిస్ అయినా నాకు చాలా నీరసంగా అనిపిస్తుంది" అని సన్నీ పేర్కొన్నారు. జిమ్?లో వెయిట్ ట్రైనింగ్?తో పాటు కార్డియో వ్యాయామాలకు ఆయన ప్రాధాన్యత ఇస్తారు. ఉదయం 6 గంటలకే నిద్ర లేవడం వల్ల రోజు మొత్తం ఎనర్జిటిక్?గా ఉండటమే కాకుండా, రాత్రుళు ప్రశాంతమైన నిద్ర సొంతమవుతుందని ఆయన నమ్ముతారు. కేవలం జిమ్ వర్కౌట్లతోనే కాకుండా యోగా ద్వారా కూడా సన్నీ తనను తాను ఫిట్?గా ఉంచుకుంటారు. రోజూ ఒక గంట పాటు తప్పనిసరిగా ప్రాణాయామం చేయడం ఆయన అలవాటు. దీనివల్ల వాయిస్?లో బేస్ పెరగడమే కాకుండా మానసిక ఒత్తిడి తగ్గుతుందని ఆయన భావిస్తారు. ఈత కొట్టడం, నడక కూడా ఆయన దినచర్యలో ప్రధాన భాగాలు. ఇలా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బ్యాలెన్స్ చేయడం వల్లే 70 ఏళ్లకు చేరువలో ఉన్నా ఆయన ఇప్పటికీ ఎంతో హ్యాండ్సమ్?గా కనిపిస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన జీవితం ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా ఫిట్?గా ఉండొచ్చని సన్నీ డియోల్ నిరూపిస్తున్నారు.

# మల్లెపూల' సైకో కిల్లర్.. ఓటీటీ టాప్ ట్రెండింగ్ లో నయా క్రైమ్ థ్రిల్లర్..




ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఈ శుక్రవారమే (జనవరి 23) ఓటీటీ స్ట్రీమింగ్ కు వచ్చింది. క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ గా సాగే ఈ తెలుగు మూవీ కేవలం ఒకే ఒక్క రోజులోనే ఓటీటీ టాప్ వన్ ట్రెండింగ్ లోకి దూసుకెళ్లిపోయింది. ఎప్పటిలాగే ఈ శుక్రవారం (జనవరి 25) పలు కొత్త సినిమాలు, వెబ్ సిరీస్ లు స్ట్రీమింగ్ కు వచ్చాయి. తెలుగుతో పాటు వివిధ భాషలకు చెందిన సినిమాలు, సిరీస్ లు ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్ పై సందడి చేస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఓటీటీలో ఎక్కువగా క్రైమ్ థ్రిల్లర్ తరహా సినిమాలకే ఎక్కువగా ఆదరణ దక్కుతోంది. ఈ నేపథ్యంలో ఒక తెలుగు క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇప్పుడు ఓటీటీలో టాప్ వన్ ట్రెండింగ్ లో కొనసాగుతోంది. ప్రస్తుతం ఓటీటీ ఆడియెన్స్ ఎక్కువగా ఈ మూవీ గురించే మాట్లాడుతున్నారు. ఈ సినిమా కథ కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఆద్యంతం ఆసక్తికరమైన కథ కథనాలు, ఉత్కంఠభరిత సన్నివేశాలు, ఊహకు అందని ట్విస్టులతో ఆడియెన్స్ కు సరికొత్త థ్రిల్ ను అందిస్తోందీ సినిమా. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సంధ్య నెల్లూరు అనే అమ్మాయి ఓ న్యూస్ ఛానెల్?లో క్రైమ్ స్టోరీస్?కు యాంకర్?గా వర్క్ చేస్తుంటుంది. టీఆర్?పీల కోసం కాకుండా నిజాలను చూపించాలని సంధ్య ఆరాటపడుతుంది. అయితే తాను అనుకున్నట్లు న్యూస్ ఛానెల్ లేకపోవడంతో సొంతగా ఓ పాడ్ కాస్ట్ స్టార్ట్ చేస్తుంది. అదే సమయంలో సంధ్య ఉన్న సిటీలోనే వరుస అత్యాచారాలు, హత్యలు జరుగుతాయి. వీటిపై కూడా పాడ్ కాస్ట్ చేస్తుంది సంధ్య. దీంతో ఆ సైకో కిల్లర్ సంధ్యను కూడా వెంబడిస్తాడు. మరి ఈ సీరియల్ కిల్లింగ్స్ కు కారణమెవరు? అసలు ఎందుకీ హత్యలు చేస్తున్నాడు? సంధ్య సైకో కిల్లర్ ను పట్టుకుందా? లేదా? అన్నది తెలుసుకోవాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఈ సైకో థ్రిల్లర్ మూవీ పేరు చీకటిలో. అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ్ల ఇందులో మెయిన్ లీడ్ చేసింది. అలాగే ప్రేమ కావాలి సినిమాలో హీరోయిన్?గా చేసిన ఇషా చావ్లా చాలా కాలం తర్వాత మళ్లీ స్క్రీన్ పై కనిపించింది. అలాగే సీనియర్ నటి ఆమని మరో కీలక పాత్రలో యాక్ట్ చేసింది. ఈ సినిమాకు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. జనవరి 23 నుంచి అమెజాన్ ప్రైమ్? ఓటీటీలో చీకటిలో మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతోపాటు తమిళం, హిందీ వంటి 3 భాషల్లోనూ ఈ మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. అయితే ఓటీటీ రిలీజ్ రోజు నుంచే అమెజాన్ ప్రైమ్?లో

# స్విమ్మింగ్ లో నేషనల్ ఛాంపియన్.. ఇప్పుడు టాలీవుడ్ క్రేజీ హీరోయిన్.. ఎవరో గుర్తు పట్టారా?



ఈ టాలీవుడ్ హీరోయిన్ మల్టీ ట్యాలెంటెడ్. చిన్నప్పటి నుంచి ఎక్స్ ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ లో బాగా చురుగ్గా పార్టిసిపేట్ చేసింది. ముఖ్యంగా స్విమ్మింగ్ లో స్టేట్ అండ్ నేషనల్ లెవెల్ పోటీల్లో సత్తా చాటింది. ఎన్నో పతకాలు కూడా సొంతం చేసుకుంది ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ ట్రెండ్ నడుస్తోంది. అదేంటంటే సడన్?గా అందరూ పదేళ్ల వెనక్కు వెళ్లిపోతున్నారు. అంటే తమ 2016లో జీవితం ఎలా ఉందో గుర్తు చేసుకుంటున్నారు. అప్పటి సంగతులు, మధుర జ్ఞాపకాలను ఫొటోలు, వీడియోల రూపంలో సోషల్ మీడియాలో షేర్? చేస్తున్నారు. పలువురు సినిమా తారలు కూడా '2016.. నోస్టాల్జిక్ వైబ్స్' అంటూ పదేళ్ల క్రితం నాటి ఫొటోలు, వీడియోలను పంచుకుంటున్నారు. దీంతో ఇప్పుడు చ2016 హ్యాష్ ట్యాగ్ ఇప్పుడు నెట్టింట బాగావైరలవుతోంది. ఈ నేపథ్యంలో ఒక ప్రముఖ హీరోయిన్ తన పదేళ్ల క్రితం నాటి ఫొటోలను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేసుకుంది. దీంతో ఆ ఫొటోలు నెట్టింట బాగా వైరలవుతున్నాయి. ఎందుకంటే అప్పటికీ, ఇప్పటికీ ఈ ముద్దుగుమ్మ బాగా మారిపోయింది. దీంతో చాలా మంది ఈ హీరోయిన్ ను గుర్తు పట్టలేకపోతున్నారు. ఆ తర్వాత అసలు విషయం తెలుసుకుని ఆశ్చర్యపోతున్నారు. మరి ఇంతకీ ఈ ఫొటోల్లో ఉన్నదెవరో గుర్తు పట్టారా ఈ ఫొటోల్లో ఉన్నది ఒక సౌతిండియన్ క్రేజీ హీరోయిన్. అయితే ఆమెకు పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు ఉంది. అలాగనీ ఆమె పాతిక, ముప్పై సినిమాలేమీ చేయలేదు. ఇప్పటివరకు కలిపి అన్ని భాషల్లో కేవలం 5 సినిమాల్లోనే నటించింది. అందులో రెండు ఏకంగా పాన్ ఇండియా సినిమాలే. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే.. హీరోయిన్ గా నటించిన రెండో సినిమాతోనే రూ. 450 కోట్లు రాబట్టిందీ అందాల తార. ఇక సినిమాల్లోకి రాకముందు ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ చేసింది ముద్దుగుమ్. ఇంజినీరింగ్ చదివిన ఈ అందాల తార కొన్ని రోజుల పాటు యాక్సెంచర్ కంపెనీలో అసోసియేట్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేసింది. అయితే నటనపై మక్కువతో సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఇంతకీ ఈ బ్యూటీ ఎవరనుకుంటున్నారా? కాంతారా ఫేమ్ సప్తమి గౌడ. బెంగళూరులో పుట్టి పెరిగిన సప్తమి గౌడ 2020లో సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. పాప్ కార్న్ మంకీ టైగర్ అనే సినిమాలో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత రిషబ్ శెట్టి సరసన కాంతారా సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో ఫేమస్ అయ్యింది. ఆ తర్వాత ది వ్యాక్సిన్ వార్ లోనూ కీలక పాత్రలో కనిపించింది. ఇక నితిన్ హీరోగా నటించిన తమ్ముడు సినిమాలో హీరోయిన్ గా నటించిన ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం ఓ హిందీ సినిమాలో నటిస్తోంది.



# స్నేహ, మెట్టెల సవ్వడి సీరియల్స్ నటి గుర్తుందా ఇప్పుడేంటిలా మారిపోయింది వీడియో వైరల్

విధి, లేడీ డిటెక్టివ్, అన్వేషిత, తరంగాలు, ఎండమావులు.. 1990లో బుల్లితెర ప్రేక్షకులను అమితంగా అలరించిన టీవీ సీరియల్స్ ఇవి. వీటిలో నటించిన వారు కూడా ఇప్పటికీ మన కళ్ల ముందు మెదులుతుంటారు. అలా 1990లో ఈటీవీలో ప్రసారమైన 'స్నేహ' సీరియల్ కూడా చాలా మందికి ఫేవరెట్. 'స్నేహ.. స్నేహ.. స్నేహ.. చిక్కు ముడుల్లోన్నో చక్కగా విప్పే ఒకే ఒక వనిత'.. ఈ తరం జనరేషన్ కు ఈ సాంగ్ పెద్దగా తెలియకపోవచ్చు.. కానీ 1990 లో బుల్లితెర ఆడియెన్స్ కు బాగా దగ్గరైన పాట ఇది. ఈటీవీలో ప్రసారమైన 'స్నేహ' సీరియల్ సాంగ్ ఇది. ఇందులో స్నేహ పాత్రలో కావేరి అనే నటి యాక్ట్ చేసింది. వంశీ తెరకెక్కించిన ఈ సీరియల్ ను ఉషా కిరణ్ మూవీస్ పతాకంపై రామోజీ రావు నిర్మించారు. సుమారు 200 ఎపిసోడ్లకు పైగా ప్రసారమైన ఈ సీరియల్ చాలా మందికి ఫేవరెట్ అని చెప్పుకోవచ్చు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఈ సీరియల్ బాగా ఆకట్టుకుంది. అందులోనూ స్నేహ పాత్రలో కనిపించిన కావేరీ నటనకు అందరూ ముగ్ధులయ్యారు. స్నేహ తర్వాత కొన్ని తమిళ సీరియల్స్ లో నటించింది కావేరి. అలాగే కొన్ని తమిళ సినిమాల్లోనూ యాక్ట్ చేసింది. తెలుగులోనూ చిన్నారి ముద్దుల పాప, సాహసం (ఓల్డ్) చిత్రాల్లో నటించిందీ ముద్దుగుమ్మ. ఇక ఆమె చివరిగా విజయ్ కాంత్ నటించిన సేతుపతి ఐపీఎస్ సినిమాలోయాక్ట్ చేసింది. సినిమాలలో కంటే బుల్లి తెరపై ఎక్కువగా కాలం కనిపించిన కావేరి 15 సీరియళ్లలో నటించింది.

కాగా కావేరి రాకేష్ అనే బిజినెస్ మ్యాన్ ను ప్రేమించి వివాహం చేసుకుంది. 2013లో వీరి వివాహం జరిగింది. ఇంట్లో ప్రేమ వివాహానికి ఒప్పుకోక పోయేసరికి పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుంది. కాగా ఒకప్పుడు బుల్లితెరపై చాలా ముద్దుగా, బొద్దుగా, చలాకీగా కనిపించిన కావేరి ఇప్పుడు గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. ప్రస్తుతం సినిమాలు, సీరియల్స్ కు దూరంగా ఉంటోన్ ఆమె ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్ కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఇందులో ఆమె చాలా సన్నగా కనిపించింది. మొదట చాలా మంది ఆమెను గుర్తు పట్టలేదు. అయితే ఆ తర్వాత అసలు విషయం తెలుసుకుని షాక్ అవుతున్నారు.

ఆ కారణంతోనే ఇలా సన్నగా.. 'ఓ సీరియల్ చేస్తున్న సమయంలోనే మా అమ్మ చనిపోయింది. అప్పుడే నాకు పెళ్లి అయ్యింది. అదే సమయంలోనే నాకు థైరాయిడ్ సోకింది. దీనికి తోడు సోదరుడు చనిపోవడంతో కాస్త డిప్రెషన్ లోకి వెళ్లాను. అందుకే అలా లావు పెరిగిపోయాను. ఇప్పుడు థైరాయిడ్ టాబ్లెట్స్ ఆపేయడంతో బరువు తగ్గుతూ వస్తున్నాను. మళ్లీ ఆఫర్స్ వస్తే సీరియల్స్ చేయడానికి రెడీ' అని అంటోంది కావేరి.

# థియేటర్ లో అలా రీల్ చేసినందుకు.. విజయ్ అభిమానిని చితక్కొట్టిన అజిత్ ఫ్యాన్స్.. వీడియో వైరల్



తమిళ చిత్ర పరిశ్రమలో తలా అజిత్ కుమార్, దళపతి విజయ్ అభిమానుల మధ్య ఉండే పోటీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొన్ని సార్లు ఈ పోటీ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ఎంతలా అంటే ఒక హీరో అభిమాని మరో హీరో అభిమానిపై దాడి చేసేలా. గతంలో ఇది సార్లు చాలా జరిగింది. ఇప్పుడు మరోసారి అది పునరావృతమైంది. వివరాల్లోకి వెళితే.. అజిత్ కుమార్ నటించిన మంగత్తా (తెలుగులో గ్యాంబ్లర్) సినిమా మళ్లీ థియేటర్లలో రిలీజైంది. ఈ సినిమా చూడటానికి అజిత్ అభిమానులు భారీగా తరలి వస్తున్నారు. తమిళనాడులోని పెద్ద ఎత్తున థియేటర్లలో ఈ సినిమా ప్రదర్శితమవుతోంది. ఈ క్రమంలోనే విజయ్ అభిమాని ఒకరు కూడా ఈ సినిమా చూసేందుకు థియేటర్ కు వచ్చాడు. అయితే సినిమా ప్రదర్శిస్తోన్న సమయంలో అతను టీవీకే పార్టీ జెండాను పట్టుకుని హల్ చల్ చేశాడు. ఇన్ స్టాగ్రామ్ లో రీల్స్ చేసేందుకు ప్రయత్నించాడు. ఇది అజిత్ అభిమానులకు బాగా కోపం తెప్పించింది. అంతే.. టీవీకే జెండాను పట్టుకుని రీల్స్ చేస్తోన్న విజయ్ అభిమానిని థియేటర్ నుంచి బయటకు తీసుకొచ్చి చితక్కొట్టారు అజిత్ అభిమానులు. దీనిని చాలా మంది తమ సెల్ ఫోన్ కెమెరాలో రికార్డు చేసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో ఈ వీడియో కాస్తా నెట్టింట వైరల్ గా మారింది. సినిమాలకు దూరమైన దళపతి విజయ్ ఇప్పుడు రాజకీయాల్లో మరింత క్రియాశీలకంగా మారిపోయారు. టీవీకే పార్టీని స్థాపించిన ఆయన ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. ఈక్రమంలోనే అభిమానులు కూడా ఆయనకు పెద్ద ఎత్తున మద్దతు ఇస్తున్నారు. టీవీకే పార్టీ జెండా పట్టుకుని తిరుగుతున్నారు. అదే ఇప్పుడు గొడవకు కారణమైంది.

printed , published and owned by DR.B.ANILKUMAR ,@ 407 THARNAKA , HYDERABAD , Telangana state.published at DAIWIK PUBLICATIONS pvt.ltd.printed at SNEHITHA PRINTERS H.NO : 2-6 , Warangal Dist.Telangana state ,EDITOR DR.B.ANILKUMAR ,RNI NO TELTEL/2021/ 81079 , cell : 7702866885 ,vijethatelugudaily@gmail.com